ప్రభాత సమాచారం
https: epaper.prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శనివారం | 20 సెప్టెంబర్ 2025 | ■ 15 పేజీలు

## గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుకు కృషి

- తాంసి మండలంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



12



2

# రహదారుల మరమ్మత్తులకు ఎట్టకేలకు మోక్షం

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- రహదారుల మరమ్మత్తుపై ఇంజినీరింగ్, ఆర్అండ్‌బీ అధికారులతో నిర్మల్ జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం
- జిల్లాలో భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక, అత్యవసర మరమ్మత్తులు చేపట్టాలి ఆదేశం
- పనులు ప్రారంభించిన ఆర్అండ్‌బీ అధికారులు..
- గ్రామీణ ప్రాంతాల్లో తొలగనున్న 'బురద' కష్టాలు
- త్వరలో శాశ్వత మరమ్మత్తు పనులకు ప్రణాళికలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ ప్రాంతాల రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. సత్వర మరమ్మతుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నిధుల కేటాయింపు, ఖర్చుల నిర్వహణ విషయంలో జిల్లాల కలెక్టర్లకు పూర్తి అధికారులు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ బృందాలు ఇప్పటికే నష్టపరిహారం అంచనాలు వేసి, అత్యవసర మరమ్మతు పనులు ప్రారంభించాయి. జిల్లా ప్రజల రవాణా సమస్యలు తొలగించడమే లక్ష్యమని, రోడ్ల మరమ్మతు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్లు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష జరిపి తక్షణ చర్యలు చేపట్టారు. ఇంజనీరింగ్ బృందాలు ఇప్పటికే నష్టపరిహారం అంచనాలు వేసి, అత్యవసర మరమ్మత్తు పనులు ప్రారంభించాయి. రహదారులపై వర్షాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చి, నీటి నిల్వలను తొలగించి, వాహన రాకపోకలు సురక్షితంగా సాగేందుకు తాత్కాలిక మరమ్మత్తులు చేస్తున్నారు.



15

## అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర క్రిస్టియన్ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్
- క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన క్రైస్తవ మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్ పిలుపునిచ్చారు. శక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్రైస్తవ మైనారిటీల సమస్యలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సమక్షంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్బంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని క్రైస్తవులు అభివృద్ధి సాధించాలన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో చర్చి నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, క్రైస్తవుల కుల, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరు, సమాధుల కోసం స్థలాల కేటాయింపు తదితర అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. క్రైస్తవ మైనారిటీల సమస్యల పరిష్కారానికి తగిన సిఫారసులు ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.



12

## పోడు కోసం చెట్ల నరికివేత

- నేలకొరిగిన సుమారు150చెట్లు ■ అడ్డుకున్న అటవీ సిబ్బందిపై దాడి ■ 50మంది ఆదివాసీలపై కేసు
- కవ్వాల్ టైగర్ జోన్, జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని పాలఘోరీ ప్రాంతంలో చెట్ల నరికివేత..

ఆదివాసీలు, అటవీశాఖ పోరులో విలువైన టేకు చెట్లు నేలకొరుగుతున్నాయి. ఆదివాసీలు అడవిలో తిష్టవేసి చెట్లు నరికి భూమి చదును చేసేందుకుయత్నిస్తున్నారు. అడ్డు వెళ్లిన ఇద్దరు అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కవ్వాల్ టైగర్ జోన్, జన్నారం అటవీ డివిజన్, ఇందన్పల్లి రేంజ్, కవ్వాల్ అటవీ సెక్షన్, సోనాపూర్ తండా పాలఘోరీల ప్రాంతంలో 150టేకు చెట్లు నరికివేశారు.

## దక్షిణ భారతదేశంలో అత్యుత్తమ సీఎండీ

15

- ప్రతిష్టాత్మక ఏసియా పసిఫిక్ హెచ్ఆర్ఎం అవార్డు అందుకున్న ఎన్. బలరాం నాయక్
- నైనీ బొగ్గు బ్లాకు ప్రారంభించడంలో కీలక పాత్ర



## పోలీస్ స్టేషన్‌లోనే పోలీసులపై దాడి

- హెడ్‌కానిస్టేబుల్, హోం గార్డుపై కత్తి దాడి
- హెడ్‌కాస్టేబుల్‌కు గాయాలు ■ ఆస్పత్రికి తరలింపు
- నిందితుడి అరెస్టు ■ ఏఎస్పీ అవినాష్ కుమార్

వివరాలు 2లో

నిర్మల్ జిల్లా కుభీర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్, హోంగార్డుపై ఓ అగాంతకుడు దాడికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి.



## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు శాంతియూత పోరాటాలు చేద్దాం

- మాజీ ఎంపీ సోయం బాపురావు
- ఉద్యమ కార్యాచరణపై ఆదివాసీ పెద్దలతో చర్చలు - 15లో



## భారీ వర్షాలతో దెబ్బతిన్న
# రహదారుల మరమ్మత్తులకు మోక్షం

- మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించిన కలెక్టర్
- జిల్లాలో భారీ వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక, అత్యవసర మరమ్మత్తులు
- పనులు ప్రారంభించిన ఆర్అండ్‌బీ అధికారులు
- త్వరలో మారనున్న రహదారుల దు'స్థితి'..







**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి శాఖ పరిధిలోని రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనేక గ్రామీణ ప్రాంతాలు మాండల కేంద్రాలకు, జిల్లా కేంద్రానికి కలిసే రహదారులు గుంతలు పడటంతో, రవాణా అంతరాయం ఏర్పడింది. ప్రజలు రోజు వారీ ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి వచ్చిన వెంటనే, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష జరిపి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ బృందాలు ఇప్పటికే నష్టపరిహారం అంచనాలు వేసి, అత్యవసర మరమ్మత్తు పనులు ప్రారంభించాయి. రహదారులపై వర్షాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చి, నీటి నిల్వలను తొలగించి, వాహన రాకపోకలు సుంక్షితంగా సాగేందుకు తాత్కాలిక మరమ్మత్తులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి మాండల, జిల్లా కేంద్రాలకు కలిపే ప్రధాన రహదారులకు ప్రాధాన్యం ఇచ్చి మరమ్మత్తు పనులు వేగవంతం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకున్నారు. జిల్లాలో రహదారి సౌకర్యాల పునరుద్ధరణ చర్యలలో భాగంగా పలు మార్గాలలో తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. నర్సాపూర్ జి, కుస్లీ రోడ్‌పై తాత్కాలిక పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. అలాగే అల్లంపల్లి రోడ్ కడెం మండల పరిధిలో రహదారి పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అదేవిధంగా తానూర్ మండలంలోని తానూర్ నుండి ముగ్గీ రహదారిపై వరదల నష్టానికి తాత్కాలిక పునరుద్ధరణ పనులు చేపట్టడం జరిగింది. సంబంధిత శాఖల అధికారులు పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో రహదారులు శాశ్వతంగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు. అలాగే, ఇకపై వర్షాల ప్రభావంతో రహదారులు దెబ్బతిన్న చోట్ల వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యమైన రహదారులకు పర్మనెంట్ రోడ్డు రిపేర్ ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నాణ్యతపై తనిఖీలు. మాన్సూన్ సీజన్‌కు ముందే రహదారుల పరిస్థితి సమీక్షించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజల రవాణా సమస్యలు తొలగించడమే లక్ష్యమని, రోడ్ల మరమ్మత్తు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి




## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంతాల పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల ద్వారా మంజూరైన పనులపై సమగ్ర సమీక్ష జరిపారు. ఇప్పటికే చేపట్టిన పనుల పురోగతిని, అటవీ అనుమతుల మంజూరు స్థితిని వివరంగా అధికారుల వద్ద నుండి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతాల్లో ప్రాజెక్టులు అమలు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు సమన్వయం అవసరమని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, అటవీ శాఖలు కలసి జాయింట్ సర్వే చేపట్టి, భూవివాదాలు లేకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సర్వే, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టాలని, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఎఫ్ఓ నాగినిబాను, బైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## స్టేషన్‌లోనే డ్యూటీ పోలీసులపై
# అగాంతకుడి దాడి


**కుభీర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కుభీర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్, హోంగార్డు పై ఓ అగాంతకుడు దాడికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ నారాయణపై కలీమ్ అనే ఆగంతకుడు పోలీస్ స్టేషన్‌లోకి చొరబడి కత్తితో దాడికి పాల్పడగా, అడ్డుకునేందుకు వచ్చిన గిరి హోంగార్డుకు సైతం గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఉన్నత వైద్యం కోసం హెడ్‌కానిస్టేబుల్ నారాయణను నిజామాబాద్ తరలించారు. కాగా హెడ్‌కానిస్టేబుల్ నారాయణను కడుపులో పొడవడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆగంతకుడు కలీం మహారాష్ట్రకు చెందిన వాడు కాగా, కుభీర్‌లోని చుట్టాల ఇంట్లో గొడవపడి పోలీస్ స్టేషన్‌కు కత్తితో వెళ్ళినట్టు తెలిసింది. డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నారాయణతో వాగ్వాదానికి దిగి కత్తితో దాడి చేశారు. ఈ విషయంపై స్టేషన్ ఎస్.ఐ కృష్ణారెడ్డికి వివరణ కోరగా, ఘటన జరిగిన విషయం వాస్తవమని తెలిపారు.

## నాలుగు నెలలుగా అందని వేతనాలు

**జన్నారం, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ ఎస్టీ టీచర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేశ్ నాయక్ రాథోడ్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని డిమాండ్ చేశారు జన్నారం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సీఆర్టీలకు జూన్ నెల నుంచి వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు దసరా పండుగకు ముందే బడ్జెట్ విడుదల చేసి ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని ఆయన కోరారు.

## సీతక్కను కలిసిన ఆదివాసీలు

**దండేపల్లి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
దండేపల్లి మండలం కొత్తమామిడిపెల్లి గ్రామ పరిధిలో గల దమ్మనపేట. మామిడిగూడ. ఆదివాసులు శుక్రవారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. లింగాపూర్ అటవీ ప్రాంతంలో ఇరవై ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తూ జీవన సాగిస్తుండగా అప్పుడప్పుడు అటవీ శాఖా అధికారులు మేము వేసిన పంటలను నాశనం చేస్తూ ఇబ్బందులకు గురిచేశారు మా ఆదివాసీలపై కేసులు నమోదు చేశారు ఎనభై కుటుంబాలు పోడు వ్యవసాయం చేస్తూ పొట్టగడుపుతున్నాం. ప్రస్తుతం పంట వేశామని అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ మాపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విన్నవించారు. జీవనోపాధి కోసం అటవీ హక్కుల పత్రాలు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.



## కిడ్నాప్, మానవ అక్రమ రవాణా
# కేసులో నిందితుడి అరెస్ట్

**ముథోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
కిడ్నాప్,మానవ అక్రమ రవాణా కేసులో ఒకరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్టు అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సి.ఐగోపీనాథ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్మీట్ లో ఏఎస్పీ మాట్లాడారు... కుబీర్ మండలం మర్లగోండా (సేవదాస్‌నగర్) తండాకు చెందిన చౌహన్ లావ్ సింగ్ కుమార్తె సోనీకి రాథోడ్ రామారావు అనే ఓ పెద్దమనిషి పెళ్లి సంబంధం చూశానని, పాక్షికవైకల్యం కలిగినటువంటి అతన్ని చేసుకోవడంతో ఆర్థికపరంగా మీ కుటుంబం బాగుపడుతుందని నమ్మబలికి బైంసా పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ ఇంట్లో ఆరు రోజుల క్రితం పెళ్లిచూపులు ఏర్పాటు చేశారనీ పేర్కొన్నారు. అబ్బాయికి రెండు కాళ్లు లేకుండా ఓ చేతు సైతం సరిగ్గా పని చేయకుండా ఉండడాన్ని చూసిన అమ్మాయి సంబంధాన్ని నిరాకరించింది. దీంతో పిల్ల తండ్రికి రామారావు డబ్బులు ఇస్తానని, పెళ్లి చేసుకోవాలని సోనీని బలవంతంగా జీబులో ఎక్కించే ప్రయత్నం చేశారనీ, అమ్మాయి సోని కేకలు వేయడంతో అందరు అక్కడి నుండి పరారయ్యారని తెలిపారు.వెంటనే బాధితురాలు సోనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నేడు రిమాండ్‌రే తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో గతంలో సైతం ఇటువంటి పరిణామాలు చవిచూసాయని పోలీసులు పేర్కొన్నారు.ఎక్కడైనా ఇలాంటి మానవ అక్రమ రవాణా లాంటి పరినామాలు చవిచూసినట్లయితే పోలీసులకు సమాచారం అందించవలసిందిగా ఏఎస్పీ కోరారు.





## 2002, 2025 ఓటరు జాబితాల సరి పోల్చే
# ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** 2002, 2025 ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002, 2025 ఓటరు జాబితాల సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్ల జాబితాల మధ్య విశ్లేషణ, మ్యాచింగ్, బ్యాచింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిశీలనను వ్యవస్థీకృతంగా నిర్వహించేందుకు 4 కేటగిరీలుగా విభజించి తదనగుణంగా నిర్దేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కేటగిరీ ఎ-లో 2002, 2025 రెండింటి జాబితాలోనూ ఒకే వ్యక్తి పేరు ఉన్నట్లయితే ఏ విధమైన డాక్యుమెంట్ అవసరం లేదని, ఈ చర్య స్పష్టంగా సరిపోలిన కేటగిరీగా పరిగణించబడుతుందని తెలిపారు. కేటగిరీ బి-2002 జాబితాలో పేరు లేదు, కానీ వ్యక్తి పుట్టిన సంవత్సరం 1987 కన్నా ముందు అయి ఉండాలని, అటువంటి వారు ఎన్నికల సంఘం సూచించిన 11 డాక్యుమెంట్లలో కనీసం ఒక్కటిలి సమర్పించాలని తెలిపారు .కేటగిరీ సి లో 2002 జాబితాలో పేరు లేదు, వ్యక్తి పుట్టిన సంవత్సరం 1987 నుండి 2002 మధ్య (తద్వారా 18 సంవత్సరాలు కన్నా తక్కువ వయస్సు) అటువంటి వారు ఒక స్వీయ డాక్యుమెంట్, కుటుంబ సంబంధిత డాక్యుమెంట్ మర్పించాలని తెలిపారు. కేటగిరీ డి- 2002లో పేరు లేదు, 2004 తర్వాత జన్మించినవారు కానీ, 2025 జాబితాలో పేరు ఉందంటే ఒక స్వీయ డాక్యుమెంట్, తల్లిదండ్రుల డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. ఈ నెల 24వ తేదీ గా నివేదికలు సమర్పించాలని తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా నివేదికలు రూపొందించాలని తెలిపారు. నిర్దేశిత గడుపులోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పిల్లలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను ఎన్నికల విభాగం అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు బ్యాంకింగ్
# కార్యకలాపాలపై అవగాహన

**సోన్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ప్రతి విద్యార్థి బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ గోపాల్ సూచించారు. సోన్ మండలం వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలశక్తి కార్యక్రమంలో భాగంగా బ్యాంకింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ, జిల్లాలో బాలశక్తి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని, వాటిలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. విద్యార్థులు రోజువారీ బ్యాంకు లావాదేవీలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం వినియోగం, పాయింట్ ఆఫ్ సేల్ (పి.ఓ.ఎస్), ఐఎంపిఎస్, ఆర్టీజిఎస్, నెఫ్ట్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తరచూ సమీప బ్యాంకులకు తీసుకెళ్లి అక్కడి లావాదేవీలను ప్రత్యక్షంగా చూపించాలని, తద్వారా సైబర్ క్రైమ్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇస్రో కళాశాలలో సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హర్కపూర్ గ్రామానికి చెందిన ఆడే విమలబాయి, ధనసింగ్ దంపతుల కుమారుడైన ఆడే సాయి ప్రమోద్ ఒడిశా రాష్ట్రంలోని బేరంపూర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఐఐఎస్ఈఆర్ ఇస్రో లాంటి ప్రతిష్టాత్మకమైన కళాశాలలో ఎస్టీ విభాగంలో 758వ ర్యాంకుతో సీటు సాధించాడు. అతను ఓ అతి సామాన్యమైన రైతు కుటుంబంలో జన్మించాడు.ప్రతిష్టాత్మకమైన ఇస్రో లాంటి కళాశాలలో తన కుమారుడైన సాయి ప్రమోద్ సీటు సాధించడం పట్ల తల్లి తండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు...శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని హర్కపూర్ తండాలో బంజారా యువసేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సంజీవ్ నాయక్ సాయి ప్రమోద్ ను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంజీవ్ నాయక్ మాట్లాడు తూ చదువుకు పేదరికం అడ్డు కాదని, పట్టుదల శ్రమించే తత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ప్రయోజకులు అవుతారని, చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. సాయి ప్రమోద్ లాంటి వారిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జాదవ్ దుధ్‌రాం, ఆడేమున్ సింగ్,రాథోడ్ గణేష్,అశోక్,కిరణ్, దీలిప్ ఉన్నారు.



## దేవి శరన్నవరాత్రుల
# కరపత్రాల ఆవిష్కరణ

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** సాయి గణేష్ భక్తమండలి గోదావరి రోడ్డు లక్షెట్టిపేట ఆధ్వర్యంలో దుర్గా దేవి నవరాత్రులకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం గోదావరి రోడ్డు లో ఏర్పాటు చేసిన దేవి మండపం ఆవరణలో స్థానిక ఎం ఆర్ ఓ దిలీప్ కుమార్ మరియు ఎస్ ఐ సురేష్ చేతుల మీదుగా కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సుల కోసం ప్రతి ఒక్కరు దుర్గా నవరాత్రులలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. అంతేకాకుండా మన లక్షటిపేటలో ఎన్నడూ లేని విధంగా కలకత్తా మరియు విజయవాడ వారి అలంకరణలతో గోదావరి రోడ్డులో దుర్గాదేవి నవరాత్రులు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని దీనికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు గడ్డం భాస్కర్ గాజుల కమలాకర్ గౌడ్ ముద్దు ప్రణవ్ శర్మ గోలి రాజమౌళి గడ్డం వికాస్ ఎంబడి రామన్న డాక్టర్ రాజు మొగిలి మధు అంజన్న పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీలు



**మందమర్రి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 61 వ వార్షిక క్రీడాల్లో భాగంగా నియర్ బై ఈవెంట్ స్థానిక సి.ఇ.ఆర్ క్లబ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా యాక్టింగ్ జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ సీఎండీ ఎం.డి బలరాం ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీల లో పాల్గొన్న క్రీడాకారులు కళాకారులు కోల్ ఇండియా స్థాయిలో ప్రతి సంవత్సరం ఎన్నో బహుమతులు సాధించి సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తున్నారని, సీనియర్ క్రీడాకారులు సంస్థలు పనిచేస్తున్న యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు.

# సత్య సర్వేక్షన్‌పై అవగాహన

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** స్వచ్ఛ సర్వేక్షన్-2025లో భాగంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జరిగే కార్యక్రమాలపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోఫీనగర్‌లోని టీజీఆర్ఎస్ బాలికల స్కూల్‌లో విద్యార్థులకు తడి పొడి చెత్త మరియు హానికార చెత్తల గురించి అవగాహన కల్పించడం జరిగింది. మరియు స్వచ్ఛత ప్లెడ్జ్ నిర్వహించారు.



# అనాథ శవాలకు వాళ్లు ఆత్మ బంధువులు



**ముథోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఈ సమాజంలో ప్రతి పుట్టిన జీవి గిట్టక తప్పదు. కొందరు మనుషులు చిరునామాతో చనిపోతే, మరికొందరు ఎవ్వరు లేని అభాగ్యులుగా చనిపోతున్నారు. అయినా వాళ్ళు వున్న ఈ రోజుల్లో అంత్యక్రియలు చేయడానికి నానా అవస్థలు, ఇబ్బందులు పడుతుంటే ఏ ఆధారం లేని అనాథలు, గుర్తు తెలియని వ్యక్తులు ఎక్కడైనా మృతి చెందిన వార్త వింటే ఆ మనుసులు చలించిపోయి అంత్య క్రియలు గావిస్తున్నారు. అనాథ శవాలను తీసుకెళ్లేందుకు సంబంధికులు ముందుకు రాకుంటే తామే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు ఐక్యత సేవ సమితి సభ్యులు. అనాథల మరణ వార్త విన్న ఐక్యత సేవా సమితి కాటికి పంపే సమయంలో ఆత్మ బంధువులుగా మారి అంత్యక్రియలు చేస్తున్నారు. ఇటు మూగ జీవాలకు సైతం ప్రమాదాలు సంభవిస్తే వైద్యాన్ని అందిస్తున్నారు. జంతువులు మృత్యువాత పడ్డ విషయాలను తెలుసుకొని, వాటికి సైతం సంప్రదాయ రీతిలో అంత్యక్రియలు నిర్వహిస్తూ ఔరా..! అనిపించుకున్నారు. గతంలో బాసరలో ఒక వ్యక్తి మరణించడంతో, బంధువులు రాక పోయే సరికి బాసర ఎస్.ఐ ఐక్యత సేవా సమితిని సంప్రదించగా, అక్కడికి వెళ్లి సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు చేసి ఔరా..! మానవతా మనుషులని అనిపించుకున్నారు.

**ముప్పైకిపైగా అనాథ శవాలకు అంత్యక్రియలు..**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి ఐక్యత సేవా సమితి సభ్యులు 30 అనాథశవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. దాదాపు 150కిపైగా జంతువులకు అంత్యక్రియలు నిర్వహించి, 100 కుపైగా మూగ జీవాలకు వైద్యాన్ని అందించారు. ఆరోగ్య పరంగా ఆపద స్థితిలో ఉన్న పేషంట్ల కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేసే ఔత్సాహికుల నుండి డబ్బులు జమ చేసి ఉపయోగపడుతూ, రక్తం అవసరం ఉన్న వారికి దాతల వివరాలు సేకరించి అందరి మన్నలను పొందుతున్నారు.

# స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ హైదరాబాద్‌నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ జాబితాలో డూప్లికేట్ ఓట్లు, నకిలీ ఓట్ల తొలగింపు కు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో చివరగా 2002 లో ఎస్ఐఆర్ చేయడం జరిగిందని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణ పై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి



సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్ఓ, డిప్యూటీ తహసిల్దారులు, బిఎల్ఓ, పర్యవేక్షకులు తగినంత మంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి అవగాహన కలిగేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ నిర్వహణకు ముందుగానే ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్ఐఆర్ వివరాలను 2025 ఎస్ఎస్ఆర్ డేటా తో సరిపోల్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ట్రైనీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### అసాంఘిక కార్యకలాపాలకు

## పాల్పడితే చర్యలు తప్పవు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని రెబ్బెన సీఐ సంజయ్ హెచ్చరించారు. శుక్రవారం రెబ్బెన మండలంలోని సింగిల్ గూడ గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో సరైన పత్రాలు లేని 15 బైక్‌లతో పాటు 2 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు విక్రయాలు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి పోలీసులకు సమాచారం ఇచ్చి గంజాయి నిర్మూలనకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సై వెంకటకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## మురిమడుగులో వైద్య శిబిరం



**జన్నారం, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.ఉమాశ్రీ, డా.లక్ష్మి సూచన మేరకు స్వస్థ నారి స్వశక్తి పరివార అభియాన్ కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా మురిమడుగు గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో గ్రామంలోని మహిళలు అందరికీ రక్తహీనత, బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులున్న వారిని పరీక్షలు చేసి మందులు అందించారు. వారికి ఆరోగ్యంపై తగిన వైద్య సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డా. గంగాదేవి, హెల్త్ అసిస్టెంట్ టేకుమట్ల పోచయ్య, జి.సులోచన, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### 24న మున్నూరుకాపు

## సంఘం తాలుక ఎన్నికలు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఈనెల 24న బుధవారం జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం తాలుక కమిటీ ఎన్నిక ఉంటుందని ఆ సంఘం నాయకులు పొలంపల్లి గణపతి తెలిపారు. శుక్రవారం ఆ సంఘం నాయకులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 24న బుధవారం జిల్లాకేంద్రంలో ఆసిఫాబాద్ మండల యూత్ కమిటీ, తాలుక కమిటీల ఎన్నిక, జిల్లా హడక్ కమిటీ వేయడం జరుగుతుందని అన్నారు. నియోజక వర్గంలోని మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



### గుంతలమయమైన రోడ్డుకు

## తాత్కాలిక మరమ్మత్తులు



**ముథోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ముథోల్ మండలంలోని అష్ట,ఓని,కౌట, గన్నోర బ్రహ్మన్ గాం, గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. అయితే ఆయా గ్రామ వీడీసి సభ్యులు, గ్రామస్తులు, పలువురు నాయకులు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను కలిసి తాత్కాలికంగా రోడ్డులకు మరమ్మత్తులు చేయించాలని విన్నవించారు. దీంతో సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించారు. వెంటనే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సూచించడంతో మరమ్మత్తులు చేయించారు. శుక్రవారం విటోలి తండా నుండి అష్ట రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో, రెడ్మిక్స్‌తో తాత్కాలికంగా మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజేష్, బిజెపి నాయకులు సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

### దసరా సెలవులను

## సద్వినియోగం చేసుకోవాలి

**మందమర్రి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు దసరా సెలవులలో చదువుపై దృష్టిసారించి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ కోరారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు దసరా సెలవులు అనంతరం పరీక్షలు నిర్వహించనున్నం దున సెలవులను వృథా చేయకుండా తమ పిల్లలు చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు కృషి చేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు. అనంతరం మెగా ప్లాంటేషన్‌లో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఒక్కో మొక్కను నాటించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. స్కూల్ కెప్టెన్, హెడ్ గర్ల్, హెడ్ బాయ్, స్పోర్ట్స్ కెప్టెన్, బాధ్యతలు అప్పగించి బాధ్యత నిర్వహణపై బాధ్యులకు అవగాహన కల్పించారు.





### విద్యా క్యాలెండర్‌ను

## పక్కగా అమలు చేయాలి

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

విద్యాశాఖ జారీ చేసిన విద్యా కేలండర్ ను పక్కగా అమలు చేయాలని విద్యాశాఖ ఆర్జెడి సత్యనారాయణ అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ పథకాలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం ద్వారా మంజూరు నిధులు చేపట్టిన పనులు పూర్తి చేసిన పనులు పెండింగ్ పనులు నిర్వాణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ అధికారులకు సూచనలు చేశారు.

### 22 నుండి ఓపెన్

## పదవ, ఇంటర్ పరీక్షలు

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



ఈనెల 22 నుండి 28 వరకు టాస్ పదవ, ఇంటర్మీ డియట్ రాత పరీక్షలు నిర్మల్‌లో నిర్వహించబడునని నిర్మల్ జిల్లా విద్యా శాఖ అధికారి డి.భోజన్న తెలిపారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షలలో పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జుమ్మెరత్ పేట్ నిర్మల్ పరీక్ష కేంద్రంగా కలదని, అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రభుత్వ పాఠశాల ఇదిగాం నిర్మల్ పరీక్షా కేంద్రంగా కలదని వివరించారు. ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు మరియు పగలు 2: 30 నుండి సాయంత్రం 5:30 వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు. ఈ పరీక్షలకు మొబైల్ ఫోన్ గాని ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కానీ అనుమతించబడవని పేర్కొన్నారు. విద్యార్థులకు ఐదు నిమిషాలకు మించి ఆలస్యమైతే వారిని పరీక్ష కేంద్రంలోని అనుమతించబడరని తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను తమ అధ్యయన కేంద్రాల ద్వారా గాని, తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం వెబ్సైట్ ద్వారా గాని డౌన్లోడ్ చేసుకొని హాజరుకావాలని పేర్కొన్నారు. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌తో పాటు తప్పనిసరిగా ఏదైనా ఒక ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తీసుకొని పరీక్షకు హాజరు కావాలని వెల్లడించారు. ఈ పరీక్షల నిర్వహణ గాను చీఫ్ సూపరింటెంట్‌లను, డిపార్ట్మెంటల్ అధికారులను, ఇన్విజి లెటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో పోలీస్ సిబ్బంది తో పాటు మెడికల్ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది ఉంటారని తెలిపారు.

## రైల్వే కార్మికులకు ఎనిమిదో పే కమిషన్ ప్రకటించాలి



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకత్వ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహించే ధర్నా లో భాగంగా శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే సీఅండ్‌డబ్ల్యూ డీపో షెడ్ ఎదుట లోకో పైలట్ క్రూ లాబీ ఎదుట స్వచ్ఛందంగా కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ చైర్మెన్ ఎస్.నాగరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల పట్ల నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైల్వే కార్మికులకు ఎనిమిదవ వేతన సంఘం అమలు చేయాలని డిమాండ్ చేశారు.రైల్వే లోకో పైలట్లకు కేంద్ర ప్రభుత్వం కిలో మీటర్ కు 25 శాతం అలవెన్స్ చెల్లించాలని, వీటి నుంచి 70 శాతం ఇన్కమ్ టాక్స్ మినహాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలువలతో కూడిన వేతన సంఘాన్ని వెంటనే ప్రకటించి జనవరి 2026 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో బ్రాంచ్ సెక్రటరీ జి. సాంబశివుడు,ట్రెజరర్ షోకిన్ మీనా, నాయకులు నిరాజ్ అగర్వాల్,కెశంకరయ్య,యూనియన్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

## టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్ అన్నారు. చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ అశోక్‌తో కలిసి జిల్లాలోని విద్యుత్ శాఖాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన అన్ని రకాల పరికరాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్లకు ప్రత్యామ్నాయ లైన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించడానికి మెయింటెనెన్స్ చేపట్టాలని, అన్ని లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు పరీక్షించి ప్రమాదకరక ప్రాం తాలు గుర్తించి వాటిని సరి చేసేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగులు పని చేసేటప్పుడు అన్ని రకాల భద్రత పరికరాలు ఉపయోగిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అన్ని రకాల అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ శేషారావు, డీఈఈ, ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, అకౌంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## సబ్సిడీపై మహిళా రైతులకు
# వ్యవసాయ పరికరాల పంపిణీ

**ముథోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీని చేయనున్నట్లు శుక్రవారం తన నివాసంలో వ్యవసాయ అధికారులతో కలిసి ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలియజేశారు. సన్నకారు మహిళ రైతులకు 50 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీపై పరికరాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో అందజేయడం జరుగుతుందన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రూటవెటర్స్, సీడ్‌కం ఫర్టిలైజర్స్ డ్రిల్లర్స్, గడ్డి కలుపు తీసే యంత్రాలు, కల్టివేటర్స్, పంపిణీ చేయడం జరుగుతుందని, అవసరమైన వారు మండలాల వారీగా వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భైంసా ఎడిఎ వీణ, భైంసా, కుంటాల, కుబీర్, వ్యవసాయ అధికారులు గణేష్,విక్రమ్, సారిక, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఆకాష్ పాల్గొన్నారు.

# మాజీ డిప్యూటీ స్పీకర్ వర్ధంతి

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ స్వర్గీయ భీమ్ రెడ్డి వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్మల్ జిల్లాలో నిర్వహించారు. ఆయన స్వగ్రామమైన మునుపెల్లితోపాటు లక్ష్మణచాంద, నిర్మల్ మండలాలలో కుటుంబ సభ్యులు భీమ్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల హక్కుల కోసం ఆయన త్యాగాన్ని మర్చిపోలేరని పేర్కొన్నారు.



# నిరు పేదల సొంతింటి కల సాకారం

## ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. శుక్రవారం మావల్, జైనథ్, బోరజ్ మండలాల్లో పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద చిట్టచివరి నిరుపేదలకు కూడా సొంతిల్లు అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారులను దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గానికి 5,500 ఇళ్లు మంజూరు చేయించినట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో నాయకులు రఘుపతి,రవి రెడ్డి, ప్రవీణ్, కరుణాకర్ రెడ్డి, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి






**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సేవల కొరకు కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, విధులు బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియలో భాగంగా పనులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాల, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు విధులలో సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్ గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేశారు. వెంకటాపూర్ గ్రామంలో నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులు చదువుతోపాటు
# క్రీడల్లోనూ రాణించాలి

**మందమర్రి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడల ద్వారా శారీరకదారుఢ్యం పెంపొందుతుందని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో భాగంగా శుక్రవారం పట్టణం లోని తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఆట పాటల్లోనూ తగిన నైపుణ్యం సాధించాలన్నారు. క్రీడల ద్వారా శరీరానికి తగిన వ్యాయామం చేకూరుతుందని విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా కారులుగా ఎదగాలన్నారు.

# అనారోగ్య బాధితులకు పరామర్శ



**ఖానాపూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఖానాపూర్ నియోజకవర్గంలో పలు మండలాల్లోని వ్యక్తులు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్, యశోద ఆసుపత్రిలో, చికిత్స చేసుకుంటున్న బాధితులను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఖానాపూర్ మండల కేంద్రంలోని న్యాయవాది నరేంద్రనాథ్, హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. దాంతోపాటు యశోద ఆసుపత్రిలో పెంబి మండలం పసుపుల గ్రామానికి చెందిన భీమ్‌సింగ్ చికిత్స పొందుతుండగా వారిని కలిసి మంచి వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**ఖానాపూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఖానాపూర్ మండలానికి చెందిన లంక దాసరి తిరుమలేష్, ఉద్యోగంలో చేరి పది నెలల్లోనే ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు అందించిన అత్యుత్తమ బోధనలకు గాను అధికారులు ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఆయనను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు.

# నిధులు మంజూరులో ఏవరి పాత్ర ఎంత?



**ముథోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు నేనంటే, నేను మంజూరు చేయిస్తున్నానని ముథోల్ ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, విట్టల్ రెడ్డిలు పోటా పోటీగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. దీంతో ఎవరి సిఫారసుతో నిధులు మంజూరు అవుతున్నాయోనని ఆయా పార్టీల కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల ముథోల్ నియోజకవర్గంలోని ఏడు దేవాలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిజిఎఫ్ నిధులు విడుదల చేయగా, గత రెండు రోజుల నుంచి ఎమ్మెల్యే పటేల్, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డిలు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు లకు నేను సిఫారసు చేశానంటే, నేను సిఫారసు చేశానని దీంతో నిధులు మంజూరైనట్లు వారు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. ఇది ఉదాహరణ మాత్రమే, సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి తదితర పథకాలకు చెందిన నిధులు కూడా నేనంటే నేను మంజూరు చేయించానని చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడం హర్షణీయమే కానీ నిర్మాణం పనులకు భూమి పూజ చేసే సమయంలో ఇరు పార్టీల కార్యకర్తలు మా నాయకుడే నిధులు మంజూరు చేయించారంటూ గొడవలకు దిగుతారేమోనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా ఆ నాయకులు గమనిం చి కార్యకర్తలు అయోమయానికి గురి కాకుండా చూడాల్సి ఉంది.



## పొంచి ఉన్న ప్రమాదం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ గ్రామీణ మండలం మామిడిగూడ వద్ద ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించి, గ్రామానికి, వంతెనకు రక్షణగా ఉన్న గోడ మూడు ముక్కలుగా విరిగిపోయింది. వాగు మలుపు వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది. ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ వెళ్లే ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రాత్రిపూట వాహనాలు వాగులో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గోడను త్వరితగతిన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మెరుగైన సేవలందించాలి



**జన్నారం, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 108 అంబులెన్స్‌ను ఖజానా కార్యాలయ అధికారి కిషోర్ తనిఖీ శుక్రవారం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే 108 అంబులెన్స్ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, ప్రోగ్రామ్ మేనేజర్ సార్మాట్, కోఆర్డినేటర్ సంపత్, రమేష్, కిషన్, మునీందర్, పైలట్ గంగాధర్, రఫీక్, మహేందర్ పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ సభ్యులు, రీజినల్ కమిటీ సభ్యులను శుక్రవారం ఎన్నుకున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రీజినల్ కార్యదర్శి అబిద్ పాషా, డిపో అధ్యక్షుడు షేక్ యూసుఫ్, కార్యదర్శి షేక్ నాజీమ్‌ను నియమించారు. కమిటీ సభ్యులు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు.

## నాటు సారా స్వాధీనం

**కాసిపేట, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండలంలోని ధర్మారావుపేట, మామిడిగూడెం గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై శుక్రవారం బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సిఐ సమ్మయ్య నేతృత్వంలో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేశారు. బానోత్ లక్ష్మి, బానోత్ రాజులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



# విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయాలి

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లు , ప్రవర్తనలో వచ్చిన మార్పులను చాంపియన్ స్టూడెంట్స్ తమ సందేశాల ద్వారా, డ్రాయింగ్స్, ఇతర ప్రదర్శనల ద్వారా వివరించారు. విద్యార్థుల సృజనాత్మకతను పరిశీలించిన కలెక్టర్ వారికి పలు ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చి, వాటిని నిత్య జీవితంలో పాటించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అనంతరం







చాంపియన్ స్టూడెంట్స్‌కి సర్టిఫికెట్లు అందించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుండి వచ్చిన స్టూడెంట్ చాంపియన్‌లు ఆరోగ్యపరంగా ఉన్న ఆరు ముఖ్య అంశాలపై విద్యార్థులు తల్లిదండ్రుల్లో వచ్చిన మార్పులను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంలో, బాలికల పాఠశాల విద్యార్థులు "సోది చెబుతానమ్మ సోది" అనే రూపకతతో కోయదొర వేషధారణలో ప్రదర్శన ఇవ్వగా, పెండల్ వాడ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మాదకద్రవ్యాలు, జంక్ ఫుడ్, పోషకాహార సంబంధిత చార్ట్ కలెక్టర్ ప్రశంసించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రతి విద్యార్థి పాటించాలని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని,విద్యార్థులు పాఠశాలకు వచ్చే ముందు ఇంట్లోనే టిఫిన్ చేయాలని, తినకుండా రాకూడదని,జంక్ ఫుడ్‌కి బదులుగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. టీమ్ ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఉపాధ్యాయుల సహకారం అన్ని వేళల్లో కొనసాగుతుందని విద్యార్థులు తెలిపారు. కలెక్టర్ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజానికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని తెలిపారు. ఈ విధంగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా సమాజంలో మానసిక, శారీరక ఆరోగ్యంపై మార్పు రావడం జరుగుతోందని పేర్కొన్నారు.

# మండల ఆఫీస్ మార్చి... పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయండి

### కలెక్టర్‌కు బోరజ్ మండల వాసుల వినతి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
బోరజ్ మండలంలో మండల కార్యాలయ స్థలం మార్చాలని, కొత్త పోలీస్ స్టేషన్ సైతం ఏర్పాటు చేయాలని కోరుతూ బోరజ్ మండల పలువురు నాయకులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ను కలిసిన సమస్యలను కలెక్టర్ కు వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోరజ్ మండలంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల కార్యాలయంతో విద్యార్థులకు అసౌకర్యంగా, ఇబ్బందిగా మారిందని తెలిపారు. మండల కార్యాలయానికి వస్తున్న జనాల రాకపోకల ద్వారా విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడుతుందని తెలియజేశారు. మండలంలోని చెక్ పోస్ట్ కార్యాలయం ముగిసిన సందర్భంగా మండల కార్యాలయాన్ని చెకపోస్టు కార్యాలయానికి మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. చెక్ పోస్టు స్థలంలో పోలీసు స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలం ఉన్నందున కొత్త మండలన్ని దృష్టిలో పెట్టుకుని మండలానికి పోలీసు స్టేషన్ ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మండల కేంద్రం నుండి సబ్-స్టేషన్ వైపు గూడ, రాంపూర్, సిరసన్న వెళ్లే దారిలో ఎయిర్టెల్ ఫైబర్ లైన్ కోసం గుంతలు తవ్వి వదిలేశారని, గత మూడు నెలల కాలంగా ఆ గుంతలతో ప్రమాదాలు జరుగుతున్న ఎవరు పట్టించుకోవట్లేదని తెలిపారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చిన పట్టించుకునే వారే లేరనీ, దయచేసి తమరు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు.



### కాసిపేట జూనియర్ కళాశాలలో
## మధ్యాహ్న భోజనం ప్రారంభం

**కాసిపేట, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో కాసిపేట మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో రత్నం ప్రదీప్, నాయకులు విద్యార్థులకు భోజనం వడ్డించి ప్రారంభించారు. 260 మంది విద్యార్థుల కోసం ఎమ్మెల్యే సహకారంతో భోజనం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్వామి, రాజమౌళి, ఆనందం, సల్మాన్ రాజ్, వెంకటేష్, రాజేష్, ప్రిన్సిపాల్ నైతం శంకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్టీయూసీ ధర్నాను విజయవంతం చేయండి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతో పాటు సింగరేణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టీఎన్టియుసి ఆధ్వర్యంలో ఈనెల 24న గోలేటి జీఎం కార్యాలయం ముందు చేపట్టనున్న నిరాహారదీక్షను విజయవంతం చేయాలని టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి.మణిరాం సింగ్ కోరారు. శుక్రవారం బెల్లంపల్లి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి ప్రగతికి పునాదిగా నిలిచిన ఉద్యోగులు 72 మిల్లీమీటర్ల లక్ష్యానికి గాను 69.06 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించి 96% టార్గెట్‌ను నమోదు చేశారన్నారు. 2024, 25 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి నికర లాభాలను ప్రకటించి కార్మికులకు లాభాల వాటా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 40% లాభాల్లో భాగస్వామ్య వాటాను కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు పట్టించి ఎప్పుడు చెల్లిస్తారో తెరపాలని ఇప్పటికే సింగరేణి సిఅండ్ఎండికి విన్నవించి నట్లు తెలిపారు. నూతన ట్రాన్స్ఫర్ విధానం రద్దు, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన చట్టం రూ 26 వేలకు తగ్గకుండా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారంగా అమలు చేయాలని కోరారు.



సింగరేణి క్వార్టర్లను పర్మినెంట్ కార్మికులకు, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు అలాట్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిఎన్టియుసి ఉపాధ్యక్షులు గద్దల నారాయణ, జిల్లా అధ్యక్షులు జీవరత్నం, మందమర్రి ఏరియా కార్యదర్శి వెంకటస్వామి, పాష, చంద్రమౌళి, పంతం యాదగిరి, గోలేటి ఇన్చార్జి గుర్రం గంగయ్య, ఎస్ ఎస్ పాండే, బొల్లు మల్లయ్య, గంగాధర్ గౌడ్, రాజయ్య, రమేష్, మేకల నర్సింగ్, మాసాడి గోపాల్, బొల్లు సత్యనారాయణ, ఎం.నవీన్, ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు
## ఎంపికైన జడ్పీహెచ్ఎస్ విద్యార్థి

**తాండూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి రాజ్ కుమార్ ఎంపికయ్యాడు. 'సాధన స్పోర్ట్స్ అకాడమీ' ఆధ్వర్యంలో గురువారం 35వ సబ్ జూనియర్ కబడ్డీ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 10 వ తరగతి చదువుతున్న రాజ్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. తద్వారా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించాడని పీడీప సాంబమూర్తి తెలిపారు. సెప్టెంబర్ 25వ తేదీ నుంచి 28వ తేదీవరకు నిజామాబాద్ జిల్లా ముప్కల్ గ్రామంలో జరుగబోయే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మంచిర్యాల జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు రాజ్ కుమార్.






# ఓటరు జాబితా సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఓటరు జాబితా సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు-కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ 2002, 2025 ఓటరు జాబితాలను సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల అధికారి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు, శాసనసభ నియోజక వర్గాల వారీగా మ్యాపింగ్ చేపట్టాలని, 2002, 2025 ఓటర్ జాబితాను సరి పోల్చేందుకు ఎబీసీడీ విభాగాలుగా విభజించాలని తెలిపారు. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు ఈనెల 23వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసి, ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ఎన్నికల అధికారికి నిర్ణీత నమూనాలో నివేదిక సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్ల ఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజసవ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. 2002, 2025 ఓటరు జాబితాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 4 కేటగిరీలుగా విభజించి వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో ఈ నెల 24వ తేదీన సమర్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్ల ఖాళీలను భర్తీ చేసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాలల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** బాలల సంరక్షణ, భద్రతకు చర్యలు తీసుకోవాలని డీసీపీవో మహేష్ అన్నారు. మండలంలోని తుంపల్లి గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి దేవిక అధ్యక్షతన బాలల సంరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరు విధిగా పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం యజమానులపై కేసులు నమోదవుతాయని అన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే, పిల్లలను పనిలో పెట్టుకున్నట్లు గుర్తిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబరు 1098 లేదా 112కు ఫోన్ చేయాలని సూచించారు. 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరహరి, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయండి

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో ఈనెల 22 నుంచి దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి ఆలయ వ్యవస్థాపకులు వెంకటాచారి తెలిపారు. 11 రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు భజన సంకీర్తనలు మాలాధారణ అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణమూర్తి పూదరి నరహరి విలాస్ తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలి




**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని ఆసిఫాబాద్ బార్ సోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవి డిమాండ్ చేశారు. సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని చేపడుతున్న నిరాహార దీక్షకు పోలీసులు అతడిని అరెస్టు చేయడంతో పాటు హైదరాబాద్ మెట్రో పాలిటన్ సిటీ క్రిమినల్ కోర్టులోని న్యాయవాదుల అనిల్, హనుమాన్‌నాయక్‌లపై కక్షిదారులు దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆసిఫాబాద్ న్యాయవాధులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని చెప్పారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ పిలుపు మేరకు విధులు బహిష్కరించినట్లు తెలిపారు.



# ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి

## ఖానాపూర్ ఎంపీడీవో సిహెచ్ రత్నాకర్ రావు

**ఖానాపూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ప్రతీ శుక్రవారం విధిగా అన్ని గ్రామాల్లో డ్రైడే పాటించాలని ఖానాపూర్ ఎంపీడీవో సిహెచ్ రత్నాకర్ రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఖానాపూర్ మండలంలోని ఇక్బాల్ పూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి సిబ్బందితో నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించారు. పలు ఇళ్లల్లో ఇనుప తొట్టిలు, కుండీ,లలో ఉన్న నీళ్లను పారబోయించి దోమలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకోసం ఎక్కడ కూడా నీళ్లు నిలువ ఉండకుండా చూడాలని ఆయన కోరారు.

# ఆర్థిక సాయం అందజేత



**జన్నారం, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుండ చంద్రయ్య పెద్ద కుమారుడు భూమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు మేమున్నాం అంటూ ముందుకు వచ్చారు కాలనీవాసులు వారంతా కలిసి రూ. 21,100 నగదుతో పాటు 75 కిలోల బియ్యాన్ని భూమేశ్ కుటుంబానికి అందజేశారు ఈ కార్యక్రమంలో జునుగూరి మల్లయ్య, కుకటికారి సుధాకర్, టేకుమెట్ల శంకర్, జునుగురు లింగన్న, బోర్లకుంట లింగన్న, జాడి పోశన్న తదితరులు పాల్గొన్నారు.

# అమరవేణి నర్సాగౌడ్ అరెస్ట్ అప్రజాస్వామికం

**తాండూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అరెస్ట్ అప్రజాస్వామికం అని మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి బుసారపు మొండిగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. ఉదయం 5 గంటల నుంచి నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లోని అమరవేణి నర్సాగౌడ్ నివాసంలో తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్ళరాంపూర్ గ్రామంలో వీడీసీల దాడిని ఖండించారు. అయితే.. వాళ్లను అక్కడికి వెళ్లకుండా అడ్డుకోవడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గౌడ కులస్తులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. అమరవేణి నర్సాగౌడ్, పొన్నం నారాయణ గౌడ్‌లను అరెస్టు చేసి నిర్మల్ టౌన్‌కు తరలించారని, నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వందలాది మంది మోకుదెబ్బ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని ఆయన తెలిపారు. అరెస్టు చేసి నిర్భందించడాన్ని తెలంగాణ గౌడసంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ, మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని మొండి గౌడ్ అన్నారు. తాళ్ళ రాంపూర్ గ్రామంలో తాటి, ఈత చెట్లను గీసుకొని కల్లు అమ్ముకున్నందుకు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేయడం.. ఇవ్వకుంటే సాంఘిక, కుల బహిష్కరణలు చేయడం దారుణమని ఆయన అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల ప్రజలను వేధించడం, పోలీస్, అబ్కారి శాఖల వారిపై, ప్రెస్ మీడియా ప్రతినిధులపై దాడులు చేసి చట్టాన్ని చేతిలోనికి తీసుకుంటున్న వీడీసీ వారి వెనుక ఉన్న వారిపై నాన్ బెయిలబుల్ క్రిమినల్ కేసులను పెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో తాళ్ళ రాంపూర్ వీడీసీపై చర్యలు తీసుకొనేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను కూడగట్టి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

మోకుదెబ్బ రాష్ట్ర అధి కార ప్రతినిధి బుసారపు మొండిగౌడ్



# ట్రాక్టర్‌పై నుండి పడి ఒకరి మృతి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ట్రాక్టర్ నుండి కింద పడి నంబాల గ్రామానికి చెందిన గంగుల నాందేవ్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ట్రాక్టర్ శుభ్రం చేసేందుకు గ్రామ శివారులోని చెరువుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ పై నుండి అదుపుతప్పి కింద పడి మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.





# సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దాం

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు లతో కలిసి పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 16వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసం కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో ప్రతిరోజు నిర్వహిస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షించాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టిక ఆహారం పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణులు తమ వివరాలు నమోదు చేసుకుని, సమయానుసారంగా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించడంతో పాటు వారి ఇండ్లలోని మగవారికి పాటించవలసిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో అందించాలని తెలిపారు. సూపర్ వైజర్లు తమ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను పర్యవేక్షించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అంగన్వాడీ టీచర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలని, మూత్రశాలలు లేని అంగన్వాడి కేంద్రాలను గుర్తించి ఉపాధి హామీ పథకం క్రింద ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పోషణ మాసం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించి పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సుధాకర్, సిడిపిఓ విజయ, రజిత, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త సౌజన్య, జిల్లా ప్రాజెక్టు సహాయకులు పాల్గొన్నారు.



# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిఎం కార్యాలయం ఎదుట ధర్నా



**మందమర్రి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
సింగరేణి యాజమాన్యం సింగరేణికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభాలను ప్రకటించి, కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని, కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) కేంద్ర కార్యదర్శి ఎండి అక్బర్ ఆలీ, బ్రాంచ్ నాయకులు శైలేంద్ర సత్యనారాయణలు అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా చలో జిఎం కార్యాలయం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏరియా జిఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం సింగరేణి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... కార్మికులకు లాభాల వాటా 35% చెల్లించాలని, కార్పొరేట్ స్థాయిలో జరిగిన స్ట్రక్చరల్ సమావేశాలలో ప్రధాన డిమాండ్లైన సొంతింటి కల, పెర్క్స్ పై ఐటి యాజమాన్య తిరిగి చెల్లించడం తదితర డిమాండ్లపై ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.43 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. నూతన బొగ్గు గనులను తెప్పించి, సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం దృష్టి పెట్టాలన్నారు. స్ట్రక్చరల్ సమావేశాల్లో యాజమాన్యం ఒప్పుకున్న సమస్యలన్నింటిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో అన్ని సంఘాలను కలుపుకొని, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు.



# మీడియా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటు

## టీయూడబ్ల్యూజే -ఐజేయు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
మీడియా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ ఆసుపత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని ఈ విషయంపైన ఆయన మండిపడ్డారు. మీడియా స్వేచ్ఛను హరిస్తూ మీడియాపై ఆంక్షలు విధించిన ఆసుపత్రి సుపరిటెండెంట్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలు ఎత్తివేసి, సూపరిటెండెంట్‌పై చర్యలు తీసుకొని, జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని జర్నలిస్టులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు చేపడుతున్న ధర్నా కార్యక్రమానికిరాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు మద్దతు తెలిపాలని కోరారు.

# సిర్పూర్ నియోజకవర్గానికి 700 మెట్రిక్ టన్నుల యూరియా

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ నియోజకవర్గానికి ఇవాళ, రేపట్లో 700 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవుతుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. సోమవారం నుండి టోకెన్లు ఉన్న రైతులకు యూరియా అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. ఎంఆర్పీ కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామగుండం ఫర్టిలైజర్ కర్మాగారం త్వరలో ప్రారంభమై యూరియా కొరత తీరుతుందని తెలిపారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ విద్యార్థుల ఎంపిక

**కాసిపేట, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఏ. అనూష, బి. శిరీష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. శుక్రవారం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహించిన అండర్-19 కబడ్డీ పోటీల్లో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని ఏ అనూష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఖోఖో పోటీలో అండర్ 19



విభాగంలో ఇంటర్ సెకండీయర్ విద్యార్థిని బి. శిరీష ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

# కేజీబీవీలో బతుకమ్మ సంబరాలు

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
నర్సాపూర్ మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో బతు కమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఎస్ఓ వీణ ఆధ్వర్యంలో రంగురంగుల పూలతో బతుకమ్మలు తయారుచేసి కోలాటం చేస్తూ ఈ సంబరాలు జరుపుకున్నారు.విద్యార్థినిలు, ఉపాధ్యాయురాలతో బతుకమ్మ ఆడారు. అనంతరం మాట్లాడుతూ దసరా సెలవులలో విద్యార్థులు ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కోతుల బెడద నుంచి కాపాడండి.. మాదారంలో యువకుడికి గాయాలు

**తాండూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
మండలంలో కోతుల బెడద కలకలకం రేపుతుంది. ఆయా గ్రామాల ప్రజలు కోతుల దాడులతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతులు ఇండ్లపై సంచరిస్తూ చిన్నపిల్లలపై దాడికి పాల్పడుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. తాజాగా తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో గోమాస మహేష్‌పై శుక్రవారం కోతులు దాడి చేశాయి. కోతుల గుంపు ఒకేసారి రావడం వాటిని తరిమేందుకు ప్రయత్నించగా యువకుడిపై వీపు భాగంలో దాడి చేశాయి. దీంతో అతడు స్వల్పంగా గాయపడడంతో చికిత్స కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అధికారులు కోతుల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.




## ఆ డైరెక్టర్ వల్లే నా జీవితం నాశనం..



బాలనటిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి టాప్ హీరోయిన్‌గా నిలిచిన రాశి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో అగ్రనటుల సరసన రాశి నటించారు. కెరీర్ దూసుకెళ్తున్న సమయంలోనే డైరెక్టర్‌ను పెళ్లి చేసుకుని వెండి తెరకు దూరమయ్యారు. అయితే ఇటీవల ఓ మీడియా ఛానెల్‌కు రాశి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో తనకు ఎదురైన కష్టాలను షేర్ చేస్తూ రాశి ఎమోషనల్ అయ్యారు. పశ్చిమ గోదావరికి చెందిన రాశి బాలనటిగా రావు గారి ఇల్లు, బాల గోపాలుడు, చెట్టు కింద ప్లీడర్, ఆదిత్య 369, పల్నాటి పౌరుషం సినిమాల్లో నటించారు. తమిళంలో ప్రియం చిత్రం ద్వారా హీరోయిన్‌గా రాశి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత పెళ్లిపందిరి, గోకులంలో సీత, శుభాకాంక్షలు, పండుగ, దాడి దాడీ, స్వప్నలోకం, హరిశ్చంద్ర, కృష్ణబాబు, సముద్రం, ప్రేయసి రావె, పోస్ట్‌మన్, మూడు ముక్కలాట వంటి చిత్రాల్లో హీరోయిన్‌గా ప్రేక్షకులను అలరించారు. వీడే, వెంకీ వంటి సినిమాల్లో ఐటెం సాంగ్స్ కూడా రాశి చేశారు. కెరీర్ బాగానే ఉన్న సమయంలో పెళ్లి చేసుకున్నారు. దాదాపుగా పదేళ్ల తర్వాత రాశికి పాప పుట్టింది. పాప పుట్టిన తర్వాత ఆమె సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, తల్లి పాత్రలు చేస్తున్నారు. అలాగే బుల్లితెరపై కూడా అలరిస్తున్నారు. అయితే పవన్ కళ్యాణ్‌తో గోకులంలో సీత మూవీలో రాశి హీరోయిన్‌గా నటించారు. మళ్లీ సెకండ్ పార్ట్ ఉంటే నటిస్తానని తెలిపారు. అలాగే తన కూతురిని సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తే.. శ్రీకాంత్ కుమారుడు రోషన్‌తో చేయిస్తానని ఆమె అన్నారు. టాలీవుడ్‌లో తనకు పవన్ కళ్యాణ్ అంటే ఇష్టమని, తనతో సినిమా చేయడానికి కూడా రెడీగా ఉన్నట్లు వెల్లడించారు. అలాగే చిరంజీవితో సినిమా చేయాలని ఉందన్నారు. ఈ ఇంటర్వ్యూ సందర్భంగా రాశి ఎమోషనల్ అయ్యారు. ఓ డైరెక్టర్ వల్ల తన జీవితం నాశనం అయ్యిందన్నారు. తాను మగరాయుడిలా ఉండాలని, లుక్ మారాలని ఓ డైరెక్టర్ ట్రైనర్‌ను పెట్టి వెయిట్ లాస్ చేయించారని ఆమె అన్నారు. ఫస్ట్ డే షూటింగ్‌లోనే చేయకూడని సీన్ పెట్టాడని, డైరెక్టర్‌గా అతన్ని మరిచిపోతానని ఆమె తెలిపారు. ఆ డైరెక్టర్ వల్ల సినిమాలో కొన్ని సన్నివేశాలు చూసి ఆడియన్స్ బాగా డిస్పాయింట్ అయ్యారని ఆమె అన్నారు. ఈ సినిమా వల్లే తన కెరీర్ ఎండ్ అయ్యిందని ఆమె తెలిపారు. ఒక ఆడపిల్ల ఉసురు పోసుకోకూడదన్నారు. రాశి ఇంట్లో వారు కూడా తన విషయంలో ఇలానే చెప్పేవారని ఆమె అన్నారు. అయితే రాశి పుట్టిన రోజు నాడే రాశి వాళ్ల నాన్న చనిపోయినట్లు ఆమె తెలిపారు. స్క్రీన్‌పైన తనని హీరోయిన్‌గా చూసి సంతృప్తిగా వెళ్లిపోయారని ఆమె తెలిపిన ఇంటర్వ్యూ నెట్టింట వైరల్ అవుతోంది.

## ఆంధ్రా ఓకే.. మరి నైజాం సంగతేంటి..?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ) హీరోగా తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ OG ఈ నెల సెప్టెంబర్ 25న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. సుజీత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో "హరిహర వీరమల్లు"లో అభిమానులు నిరాశకు గురైన నేపథ్యంలో, ఈ సినిమా తప్పకుండా హిట్ కావాలని ఫ్యాన్స్ ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాకి సంగీత దర్శకుడిగా తమన్ పని చేయగా, ఇప్పటికే విడుదలైన సాంగ్స్, బీజీఎమ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన OG, ఊహించని రేంజ్ హైప్ క్రియేట్ చేసింది. ఇక సినిమా విడుదలకు కేవలం వారం రోజులే మిగిలిన నేపథ్యంలో, మేకర్స్ ప్రమోషన్ కార్యక్రమాలు స్పీడ్ పెంచారు. అందులో భాగంగా సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుంది. ఈ ఈవెంట్‌తో సినిమా ప్రమోషన్ మరింత ఊపందుకోవడం ఖాయం. అంతేకాకుండా, OG సినిమాను విడుదలకు ఒక రోజు ముందు అంటే సెప్టెంబర్ 24న ఆంధ్రప్రదేశ్‌లో ప్రీమియర్ షోలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1000 టికెట్ ధరకు అనుమతి ఇచ్చింది. అయితే ఈ టికెట్ రేట్లు సామాన్య ప్రేక్షకుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే గుంటూరులో కొన్ని థియేటర్లలో ప్రీమియర్ షోలు ప్లాన్ అవుతున్నాయి. అయితే నైజాం ఏరియాలో ప్రీమియర్ షోలు జరగాలా వద్దా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. గతంలో జరిగిన కొన్ని ఘటనల వల్ల నైజాంలో బెన్‌ఫిట్ షోలపై అనుమానాలు కొనసాగుతున్నాయి. ఇక సినిమా రిలీజ్ రోజు తెల్లవారుజామున 1 గంట, 4 గంటల షోలు ఉంటాయా? అనేది కూడా ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. దీనిపై ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉంది. మొత్తానికి పవన్ కళ్యాణ్ OG హవా ముందే స్టార్ట్ అయింది. షోలు, టికెట్ రేట్లు, ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో సినిమా చుట్టూ హైప్ ఇంకా పెరుగుతోంది.




## కాంతార చాప్టర్ 1 ట్రైలర్ అప్‌డేట్

పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధంగా ఉన్న సినిమా "కాంతారా: చాప్టర్ 1". అక్టోబర్ 2, 2025న ఈ చిత్రం భారీ స్థాయిలో తెలుగు, కన్నడ, హిందీతో పాటు ఇతర భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది. మొదటి భాగం కన్నడలో ఘనవిజయం సాధించగా, ఇతర భాషల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. రిషబ్ శెట్టి డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ చిత్రం, అతని నటన, టెక్నికల్ వ్యాల్యూస్‌తో అద్భుతమైన ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి ప్రీక్వెల్‌గా రాబోతున్న చాప్టర్ 1 పై కూడా భారీ క్రేజ్ నెలకొంది. అయితే సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్నా కూడా ప్రమోషన్లు ప్రారంభం కాకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే ఇప్పుడు మేకర్స్ అభిమానులు ఎదురు చూస్తున్న ట్రైలర్ అప్డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. ట్రైలర్‌ను సెప్టెంబర్ 22, మధ్యాహ్నం 12:45 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ అప్‌డేట్‌తో అభిమానుల్లో ఫుల్ ఖుషి అయిపోతున్నారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మరోవైపు, అమెరికాలో ప్రీమియర్ షోల కోసం అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. అక్కడ రెస్పాన్స్ చూస్తుంటే సినిమాపై అంచనాలు ఎంతగా ఉన్నాయో అర్థమవుతోంది. తెలుగు వెర్షన్‌కు కూడా మంచి రెస్పాన్స్ వస్తుండటం విశేషం. కన్నడ వెర్షన్‌తో సమానంగా తెలుగు బుకింగ్స్ దూసుకెళ్తుండటంతో, తెలుగు ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి ఏ రేంజ్ లో ఉందో అర్థమవుతోంది. ఈ సినిమాలో రిషబ్ శెట్టితో పాటు రుక్మిణి వసంత్, గుల్షన్ దేవయ్య ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. హొంబలే ఫిలిమ్స్ నిర్మాణం వహిస్తుండగా, సంగీతాన్ని అజనీష్ లోకనాథ్ అందిస్తున్నారు. ఈసారి కూడా 'కాంతారా' మ్యాజిక్ మరోసారి కనపడనుందా అనే ఆసక్తితో ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు.




## మిరాయ్ కలెక్షన్స్ ఊచకోత..

తేజ సజ్జా హీరోగా నటించిన తాజా చిత్రం "మిరాయ్" భారీ విజయం సాధిస్తూ బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టిస్తోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఫాంటసీ థ్రిల్లర్ ప్రేక్షకుల నుంచి విశేష స్పందన తెచ్చుకుంటోంది. సెప్టెంబర్ 12న విడుదలైన ఈ చిత్రం మొదటి వారం ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా ₹112.10 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టి ప్రేక్షకులను, పరిశ్రమను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ సినిమా విడుదలైన తొలి ఐదు రోజుల్లోనే ₹100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టడం విశేషం. తాజాగా మేకర్స్ విడుదల చేసిన పోస్టర్ ద్వారా ఈ 7 రోజుల కలెక్షన్లను అధికారికంగా వెల్లడించారు. ఈ అద్భుత విజయంతో మిరాయ్ టాలీవుడ్‌లో టాప్ గ్రాసర్స్‌లో ఒకటిగా నిలిచింది. ఇక మరోవైపు సెప్టెంబర్ 25 వరకు ఏ పెద్ద సినిమా విడుదల కావడం లేదన్న విషయం కూడా మిరాయ్ కలెక్షన్లకు కలిసివచ్చే అంశంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించింది. విశ్వప్రసాద్ ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించగా, తేజ సజ్జా సరసన రితికా నాయక్ కథానాయికగా కనిపించింది. ఇక మంచు మనోజ్ కీలకమైన విలన్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అదేవిధంగా శ్రియ శరణ్, జగపతిబాబు, జయరాం వంటి నటులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా కథ విషయానికొస్తే అశోకుడి తొమ్మిది గ్రంథాలు అనే ప్రాచీన కాన్సెప్ట్. ఇందులో ఫాంటసీ, అడ్వెంచర్, యాక్షన్ అంశాలను సమపాళ్లలో మిక్స్ చేసి, ఒక పాన్ ఇండియా స్థాయిలో తీసిన విజువల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇలాగే కొనసాగితే, మిరాయ్ తేజ సజ్జా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలవడమే కాకుండా, టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు కూడా నమోదు చేసే అవకాశం ఉంది. మొత్తం మీద, మిరాయ్ చిత్రానికి మంచి పాజిటివ్ బజ్ ఏర్పడింది. రాబోయే రోజుల్లో ఈ క్రేజ్ కొనసాగుతుందన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

## టాలీవుడ్‌కు లేడీ లక్కుగా 'వైబ్ బేబీ'..

టాలీవుడ్‌లో ప్రస్తుతం యూత్‌ను మంత్రముగ్ధులను చేస్తూ, వరుస విజయాలతో దూసుకుపోతున్న నటి రితికా నాయక్ గురించి మాట్లాడుకోవాలి. 'వైబ్ బేబీ'గా పేరు తెచ్చుకున్న ఆమె, తన క్యూట్ లుక్స్, నాచురల్ పెర్ఫార్మెన్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. రితికా నటించిన మొదటి మూడు సినిమాలు వరుసగా బ్లాక్‌బస్టర్ హిట్లుగా నిలవడం విశేషం. ఒక్కో సినిమా మరో దానికంటే ఎక్కువ కలెక్షన్లు రాబట్టడం ఆమెకు మంచి క్రేజ్ తీసుకొచ్చింది. రితికా, విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' సినిమాలో కీలక పాత్రతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఇందులో ఆమె పాత్రకు మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా ఆమె కెరీర్‌కు మంచి లాంచింగ్ అయింది. అంతేకాకుండా, నాని, మృణాల్ ఠాకూర్ నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో, రితికా నానికి కూతురిగా భావోద్వేగంతో నిండిన పాత్రలో నటించి ఆకట్టుకుంది. ఈ సినిమా ఆమెకు ఫ్యామిలీ ఆడియన్స్‌లో గుర్తింపు తీసుకొచ్చింది. ఇటీవల విడుదలైన 'మిరాయ్' సినిమాతో రితికా(Mirai Heroine) హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. తేజా సజ్జా హీరోగా నటించిన ఈ చిత్రం భారీ వసూళ్లు సాధించింది. 100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ చిత్రం, రితికాకు ఇండస్ట్రీలో బెస్ట్ బ్రేక్ ఇచ్చిన సినిమాగా నిలిచింది. విదేశాల్లో కూడా ఈ చిత్రం 2 మిలియన్ డాలర్లు క్రాస్ చేయడం విశేషం. ప్రస్తుతం రితికా చేతిలో రెండు పెద్ద సినిమాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఆనంద్ దేవరకొండతో నటిస్తున్న 'డ్యూయెట్' అనే చిత్రం. ఈ సినిమా సుమారు ఏడాదిన్నర క్రితమే ప్రారంభమైంది. కానీ తాజాగా దీనిపై ఎలాంటి అప్డేట్ లేదు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఇంకో సినిమా మెగా హీరో వరుణ్ తేజ్ సరసన చేస్తున్న ప్రాజెక్ట్. ఇది ఇండో-కొరియన్ హారర్ డ్రామాగా రూపొందుతుంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఈ సినిమాను UV క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్నాయి. 'ఎఫ్3' తర్వాత వరుణ్ తేజ్‌కు సరైన హిట్ రాలేదు. ఇటీవలే తండ్రిగా మారిన ఈ హీరోకు మంచి హిట్ అవసరం. అలాగే ఆనంద్ దేవరకొండ కూడా 'బేబి' తర్వాత 'గంగంగణేశా'తో నిరాశపరిచాడు. ఆయనకూ మరో హిట్ అవసరం. ఇప్పటి వరకూ రితికా నాయక్ చేతికి వచ్చిన అవకాశాలన్నీ ఆమె కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ఇప్పుడు ఆమె నటిస్తున్న రెండు సినిమాలు కూడా మంచి హైప్‌లో ఉన్నాయి. దీంతో యూత్ ఐకాన్‌గా ఎదుగుతున్న ఈ భామ, వరుణ్ తేజ్, ఆనంద్ దేవరకొండలకు లేడీ లక్కు అవుతుందా? లేదో చూడాలి.





# ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

అన్ని ప్రభుత్వ ఉద్యోగాలలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా టి.ఎల్.ఎం. మేళాకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవితవ్యాన్ని బంగారుమయం చేసి, వారి జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత గల వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. పిల్లల తల్లిదండ్రులలో దినసరి కూలీలు, ఉద్యోగులు, అనేక రంగాలలో పనిచేస్తున్న వారు ఉంటారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తారని తెలిపారు. పిల్లల అవసరాలు తీర్చి ఏకాగ్రతతో చదువుకునేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలలో చదవడం, రాయడం, మాట్లాడడం తప్పనిసరిగా వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. సాధారణ విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల పిల్లలలో అభ్యసన నైపుణ్యాలు మెరుగ్గా ఉంటాయని, ఇదే స్థాయిలో విద్యార్థులందరిలో పఠన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ఇతర ప్రాంతాలలో స్థిరపడి చదువు నేర్పించేందుకు కృషి చేస్తూ ఉంటారని తెలిపారు. మానవ జీవితంలో విద్యకు అంతటి ప్రాముఖ్యత ఉంటుందని, చిన్నపిల్లలు ఏ విషయాన్నైనా త్వరగా నేర్చుకుంటారని అన్నారు. కొంత మంది చదువు లేని తల్లిదండ్రులు వారి పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు శ్రమిస్తుంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించి ప్రతి విద్యార్థి చదువుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్య, అభ్యాసన ప్రమాణాలను మెరుగు పరచడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాల నడుమ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించడం జరుగుతుందని, ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రహరీ గోడ, అదనపు గదులు ఇతర అనేక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. సదుపాయాలపై ప్రతిపాదనలు సమర్పిస్తే సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో వంటశాల, భోజనశాల, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో నూతనంగా 270 మంది ఉపాధ్యాయులను నియమించి విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పాఠశాలలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా కృషి చేయాలని తెలిపారు. చదివితే కలిగే ప్రయోజనాలు ఆలస్యంగా తెలుస్తాయని, ఉపాధ్యాయులు లర్నింగ్, టీచింగ్ పద్ధతులను విద్యార్థులకు అర్థమయ్యేలా పాటించాలని తెలిపారు. పిల్లలు ఆటలు, పాటల ద్వారా అధికంగా నేర్చుకుంటారని, పిల్లలలో చదువుపై ఆసక్తి కలిగేలా కథలు, ఇతర అంశాల రూపంలో ఆకర్షించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అనంతరం సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ టాలెంట్ అవార్డు అందుకున్న కాత్లే శ్రీధర్

**ఇచ్చోడ, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ శాంతి దినోత్సవ సందర్భంగా ఇచ్చోడ మండలం లోని దుబార్ పేట్ గ్రామానికి చెందిన ఆదివాసి సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ ప్రముఖ ఆదివాసి కళాకారుడు కాత్లే శ్రీధర్ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ టాలెంట్ అవార్డు ను అందుకున్నారు. ఈ సందర్భంగా కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం చేసిన సాంఘిక మరియుసాంస్కృతిక సేవలను గుర్తించి సిఫా బుక్ ఆఫ్ రికార్డు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ టాలెంట్ అవార్డును సినిమా నటులు రాగిణి, గబ్బర్ సింగ్ కమెడియన్ జూనియర్ రాజశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందు కోవడం చాలా సంతోషంగా ఉందని, తనను నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, తోటి కళాకారులకు, ఈ అవకాశం ఇచ్చిన పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరూ బీఆర్ఎస్‌లో చేరలేదు

**ఇచ్చోడ, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని గేర్జామ్ గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు కూడా బిఆర్ఎస్ పార్టీలో చేరలేదని ఆ పార్టీ మండల కన్వీనర్ కళ్లెం నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం రోజున గెర్జామ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు బి ఆర్ఎస్ లో చేరినట్లు వచ్చిన వార్త అవాస్తవమని పార్టీ కార్యకర్తలు ఎవరు కూడా బిఆర్ఎస్ లో చేరలేదని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా ఏమిటో రుచి చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేష్, మాజీ సర్పంచ్ జెలై జాకు, మాజీ ఎంపీటీసీ సభ్యుడుజాహిద్ పార్టీ నాయకులు కొత్తూరు లక్ష్మణ్,ముస్తఫా, ఆసిఫ్, ఆశన్న పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయవాదులు హనుమాన్ నాయక్, అనిల్ కుమార్ లపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న మాట్లాడుతూ... న్యాయవాదులపై పెరుగుతున్న దాడులను పునరావృతం కాకుండా ఉండాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం అమలులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.



## ఆరు గ్యారెంటీలతో మోసం

**ఇచ్చోడ, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని తెలుపుతూ శుక్రవారం రోజున మండలం లోని ముక్రా కే గ్రామ తాజా మాజీ సర్పంచ్ మీనాక్షి గ్రామంలో ఇంటింటికి వాల్ పోస్టర్‌లను అంటించారు. మహాలక్ష్మి పథకం 2500, తులం బంగారం, 4000 పింఛన్, ఆడపిల్లలకు స్కూటీలు, సంపూర్ణ రుణమాఫీ, 15000 రైతు భరోసా పథకాల వాల్ పోస్టర్‌లను గ్రామంలో అతికించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతొ ప్రజలను మోసం చేసింది అని, ఒక పథకం కూడా సరిగ్గా అమలు చేయక ప్రజలను మోసం చేసిందని, 100 రోజుల్లో 6 గ్యారంటీలు పూర్తిగా అమలు చేస్తానని చెప్పి అధికారంలో వచ్చి 22 నెలలు అవుతున్న ఇంకా పూర్తిగా హామీలు అమలు చేయలేదని,అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని మాజీ సర్పంచ్ మీనాక్షి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్ఓఎఫ్ అండర్-14 బాలికల కబడ్డీ, అండర్-14, 17 బాల బాలికల బేస్ బాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వాహకులు హరిచరణ్ పాల్గొన్నారు.



## విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో హోమ్ సైన్స్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైంటిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ ప్రియాసుగంధి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛత సేవ కార్యక్రమంలో విద్యార్థులకు పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. సమతుల్య ఆహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.





## దేవి నవరాత్రులను
# సామరస్యంతో జరుపుకోవాలి
### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
రానున్న దుర్గాదేవి మరియు శారదా దేవి నవరాత్రి ఉత్సవాలకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి సంసిద్ధమై ఉందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం నందు ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడానికి సహకరించిన ప్రజలకు, కృషిచేసిన ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది అధికారికి అభినందనలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపడానికి ప్రత్యేక కార్యచరణను అవలంబించనున్నట్లు అందులో భాగంగానే కల్తీకల్లు, ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా లాంటి వాటిని పూర్తిగా రూపుమాపేల కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల పరిధిలో రాజ్యాంగ విరుద్ధంగా విడీసీలు ఎలాంటి కార్యకలాపాలను నిర్వహించకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా నిర్మించడానికి జిల్లాలోని ప్రతి ఒక్క పోలీసు అధికారి పూర్తి స్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని గంజాయిని అరికట్టాలని తెలిపారు. రానున్న దుర్గ నవరాత్రి శారదా దేవి ఉత్సవాలలో మండలాల పరిధిలోని ప్రతి ఒక్క గ్రామాలలో కమిటీ సభ్యులచే సమావేశాలు ఏర్పాటుచేసి డీజేలను ఏర్పాటు చేయరాదని, రాత్రి సమయాలలో మండపాలలో మగ వ్యక్తులు ఉండేలా చూసుకోవాలని, మహిళలకు రక్షణగా షీ టీం బృందాలు ఈవ్ టీజింగ్ జరగకుండా పర్యవేక్షిస్తుంటాయని, ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ద్వారా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలియజేయాలన్నారు. ప్రజలకు విద్యార్థులకు చట్టం పట్ల నేరాల పట్ల భవిష్యత్తు పట్ల అవగాహన కల్పించే విధంగా ప్రజలతో విద్యార్థులతో సత్సంబంధాలను మెరుగుపరిచే విధంగా నూతన కార్యక్రమాలను వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా ట్రాఫిక్ సైబర్ లపై అవగాహన కార్యక్రమాలు, ఆంటీ డ్రగ్ క్లబ్, మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళ, రోడ్ సేఫ్టీ క్లబ్, కాకి కిడ్స్ లాంటి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో ఆదివాసి యువతకు త్వరలో డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ఏర్పాటు చేసి మారుమూల ఆదివాసి గిరిజన యువకులకు లైసెన్సును ఏర్పాటు చేసే విధంగా కార్యచరణ రూపొందించాలని తెలిపారు. రౌడీలు సస్పెక్ట్ లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా కఠినమైన చర్యలతో కట్టడి చేయాలని సూచించారు. ప్రజలను వడ్డీ పేరుతో నడ్డి విరిచే వ్యాపారుల పట్ల చట్ట ప్రకారం కఠినమైన చర్యలతో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో జిల్లా లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది సిబ్బంది అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహించడం జరిగింది. రాత్రి సమయాలలో ఫింగర్ ప్రింట్స్ పరికరం ద్వారా తనిఖీలు నిర్వహిస్తూ అనవసరంగా తిరిగి వారి నీ కట్టడి చేయాలని నేరస్తులను పట్టుకునేందుకు కనుగొనేందుకు ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని సూచించారు. పోలీస్ స్టేషన్ల వారిగా నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులు దర్యాప్తు కేసుల పురోగతిపై ప్రతి ఒక్క కేసును క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, హాసీబుల్ల, కమతం ఇంద్ర వర్ధన్, ఆదిలాబాద్ జిల్లా సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు డిసిఆర్బి, ఎన్ఐబి, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



### కార్మికుల సమస్యల పరిష్కారంలో
# ప్రభుత్వం విఫలం
### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అవుతుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మున్సిపాలిటీ ఎదురుగా సమస్యలు పరిష్కరించాలని చేపడుతున్న సమ్మెను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో మాట్లాడి రెండు రోజులలో వేతనాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వేతనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తమ సమస్య పరి ష్కారం అయ్యేంతవరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదని కార్మికులు తెలిపారు. కార్మికులకు సీనియర్ సిటిజన్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మార్త సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయకులు సంజీవ్, కార్మికులు పాల్గొన్నారు.

# రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలి

**మందమర్రి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని మార్కెట్ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని టిజిఆర్టిసి బస్సు సౌకర్యం మెరుగుపరచాలని, మందమర్రి మార్కెట్ నుండి మంచిర్యాలకు బస్సు ట్రిప్‌లు పెంచాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణం నుండి మంచిర్యాలకు, హైదరాబాద్ కు వెళ్లే బస్సులు మార్కెట్ బస్టాండ్ లోకి వచ్చి వెళ్లాలని కోరుతూ శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ సీరం జనార్ధన్ కు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా మందమర్రి మార్కెట్ నుండి మంచిర్యాల, హైదరాబాద్‌కి వెళ్లే విద్యార్థు లు,వివిధ దుకాణాలలో, షాపింగ్ మాల్‌లో పనిచేసే ప్రజలు, ఉపాధి కొరకు నిరంతరం ప్రయాణిస్తున్న పట్టణ ప్రజలు, ముఖ్యంగా సింగరేణి కార్మికులు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి



తీసుకొని, మందమర్రి మార్కెట్ నుండి మంచిర్యాలకు బస్సు వేయాలని కోరారు. అది వీలుగాని పక్షంలో బెల్లంపల్లి నుండి మంచిర్యాలకు వెళ్లే బస్సులను ఉదయం 3 ట్రిప్ లు, సాయంత్రం 3 ట్రిప్ లు మార్కెట్ లోపలికి వచ్చి, వెళ్లాలని సూచించారు. బస్సులు రావడం లేదని తెలి పారు. సమస్యలపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిం చారన్నారు. వారం రోజులలో మందమర్రి మార్కెట్ నుండి హైదరాబాద్ కి బస్సు నడిపిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.



# ఎమ్మెల్యే ఆదేశాలతో గుంతల పూడ్చివేత

**రెబ్బెన, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా రెబ్బెనలోని ఎన్టీఆర్ కాలనీలో సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు తాజా మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్య దేవి తనయుడు పూడ్చివేశారు. ఇటీవల ఎమ్మెల్యే కాలనీ వాసుల సమస్యలు విని, తక్షణ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు గుంతలను పాక్షికంగా పూడ్చివేయడంతో ఎమ్మెల్యే చొరవకు, ప్రజల పట్ల ఆమె చూపిన శ్రద్ధకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భరోసా

**బోథ్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండలంలోని బుగ్గరాం గ్రామంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఫ్రెషేర్స్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనిల్ అన్న 24 గంటలు అందుబాటులో ఉంటాడని, ఏ సమస్య వచ్చినా తన వద్దకు రావాలని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



### విద్యార్థులకు నాణ్యమైన
# భోజనం అందించాలి
### మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమీషనర్ విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ ను ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం వసతి గృహ విద్యార్థుల సంక్షేమం కోసం ఎన్నో నిధులు కేటాయిస్తుందన్నారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని వసతి గృహ సంక్షేమాధికారికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంతేకాకుండ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం హాస్టల్ కిచెన్, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.



### క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ చైర్మన్
# దీపక్ జాన్‌ను సన్మానించిన పాస్టర్లు

**ఖానాపూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను శుక్రవారం కడం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, పాస్టర్లు సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన జిల్లా స్థాయి పాస్టర్ల సమావేశంలో స్థానిక పాస్టర్లు ఆయనను సన్మానించినట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ప్రశాంత్ కుమార్, రాజబాబులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ జిల్లా కలెక్టర్లకు వినతి చేస్తూ, క్రైస్తవ సమస్యలపై స్పందించాలని వారికి కావలసిన స్మశాన స్థలాలు, కమ్యూనిటీ హాల్, చర్చి నిర్మాణాలకు, అనుమతులు ఇచ్చి

### కమ్యూనిటీ హాల్, సమాధుల స్థలం, చర్చి నిర్మాణాలకు వినతులు

సహాయం చేయాలని వారు చైర్మన్, కలెక్టర్లను, కోరినట్లు తెలిపారు. అందుకు చైర్మన్ ,కలెక్టర్ లు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. స్థానిక తహసీల్దారులకు ఆదేశాలు ఇచ్చి సమస్యలు పరిగణలోకి తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నట్లు వారు తెలిపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎంపిక జరిగినట్లు తెలిపారు. నిర్మల్ జిల్లా పాస్టర్ల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.



గౌరవ అధ్యక్షులుగా పాస్టర్ జాన్సన్, అధ్యక్షులుగా పాస్టర్ రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా పాస్టర్ సొలోమోన్ రాజ్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ ప్రశాంత్, జాయింట్ సెక్రెటరీ పాస్టర్ శామ్ రాజ్, ట్రెజరర్ గా పాస్టర్ సంతోష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాస్టర్ నాగాజి, పాస్టర్ సంజీవ్, పాస్టర్ డేవిడ్, పాస్టర్ రాజబాబు, పాస్టర్ రవి, పాస్టర్ బిఎస్ తిమోతి, లు ఎంపికైనట్లు వారు తెలిపారు.

# ఆర్జీయూకేటీలో ఏఐపై ప్రత్యేక శిక్షణ



**ముథోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో టీజీఎఫ్ డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు, ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్‌తో కలిసి ప్రత్యేక ఇంటరాక్టివ్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్రపరిశ్రమలో కృత్రిమ మేధస్సు (ఏఐ) పాత్ర, సృజనాత్మకత, కథనం, నిర్మాణ సామర్థ్యం, కంటెంట్ డెలివరీలో దాని ప్రభావంపై చర్చించారు. అదే సమయంలో, ఐఈఈఈ విద్యార్థి శాఖ, ఈసీఈ విభాగం కార్యాల యం ప్రారంభించారు. దిల్ రాజు మాట్లాడుతూ.. చిత్ర నిర్మాణంలో ఏఐ పాత్రను వివరించారు. ఏఐ పరిశ్రమలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను ఉపాధి అవకాశాలతో సమన్వయం చేయడానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సాంకేతిక ఆవిష్కరణలకు వేదిక ఈ సదస్సులో ఐఈఈఈ హైద రాబాద్ విభాగం సభ్యులు, ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్‌తో పాటు దిల్‌రాజు, ఐఈఈఈ ప్రపంచ ప్రభావం, సాంకేతిక పురోగతిపై చర్చించారు. 39 గ్లోబల్ సొసైటీలు, 20 సెక్షన్ల ద్వారా సాంకేతిక సహకారం, అభ్యాసాన్ని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఐఈఈఈ విద్యార్థి శాఖ కౌన్సిలర్ డాక్టర్ నామాని రాకేశ్, చైర్పర్సన్ జి.వంశ్రీ శాఖ అభివృద్ధి కోసం తమ ప్రణాళికలను పంచుకున్నారు. రాబోయే కార్యక్రమాల గురించి తెలియజేశారు.



## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

### అసెంబ్లీ ఇంచార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

పేద బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ ఆదిలాబాద్ ఇంచార్జీ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన 14 లక్షల విలువ గల 27 చెక్కులను ఆయన లబ్దిదారులకు శుక్రవారం అందజేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అంతకు ముందు ప్రజా దర్బార్‌లో ప్రజలు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వివిధ సమస్యలపై ప్రజలిచ్చిన దరఖాస్తు లను మంత్రులు, ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, నర్సింగ్, బండారి సతీష్,లోక ప్రవీణ్ రెడ్డి,అల్చెట్టి నాగన్న, మంచాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



పట్టణ పరిధిలోని సీసీసీ శ్రీరామ్‌నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు సీర్లశ్రీనివాస్ (38) ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉపేందర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూనాగార్జున కాలనీకి చెందిన శ్రీనివాస్ శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గనిలో జనరల్ మద్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మిడిల్ షిఫ్ట్ విధులు నిర్వహించి సీసీసీ కార్నర్ వద్ద గల శ్రీరాంనగర్‌లోని ఆయన సొంత ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికుడు లెంకంటి సురేందర్ వెంటనే శ్రీనివాస్ తండ్రి సీర్ల నర్సయ్యకు సమాచారం ఇచ్చాడు. నర్సయ్య ఇంటికి వెళ్లిచూడగా శ్రీనివాస్ కాలిన గాయాలతో కిందపడి ఉన్నాడు. అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు. కాగా, శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని శివాజీ గ్రౌండ్‌లో గత మార్చి 10న రౌడీషీటర్ ఎర గుంట సంపతిపై జరిగిన దాడి కేసులో ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసి ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తప్పించుకుని తిరుగుతున్న వివేక్, రంజిత్ వర్మను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## పేకాడుతున్న 10మందిపై కేసు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని శాంతినగర్‌లో పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆ కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.36,640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే, ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్ చౌక్‌లోగల వజ్ర ఫంక్షన్‌హాల్ టెర్రస్‌పై పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## కొమురం భీమ్ కాలనీ వాసులకు అండగా తుడుందెబ్బ



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్‌లోని కొమురం భీమ్ కాలనీ వాసులను తుడుందెబ్బ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కాలనీలో తొమ్మిది తెగల ఆదివాసీలు నివసిస్తున్నారని, వారికి పూర్తిస్థాయిలో మద్దతుగా ఉంటామని నాయకులు తెలిపారు. శాశ్వతంగా నివసించడానికి తమ మద్దతు కావాలని కాలనీ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో పెందోర్ ప్రభాకర్, మెస్రం దుర్గు పటేల్, పూర్క బాపూరావు, దాదిరావు, హన్మంత్ రావు, విట్టల్ రావు, జ్ఞానేశ్వర్, కిరణ్, విశ్వనాథ్, గోడం గణేష్, ఆత్రం గనాపతి, వెడ్మ ముకుంద్, గోడం రేణుక బాయి, ఉయక ఇంద్రబాయి, సమస్త కొమురం భీమ్ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



**తాంసి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి తాంసి మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డితో కలిసి వారు పాల్గొన్నారు. తాంసిలో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం ప్రధాన మంత్రి మాతృ వందన పథకం కింద ప్రసూతి ప్రయోజనాల కిట్ల పంపిణీ చేపట్టారు. మార్కాగూడలో నూతనంగా నిర్మించిన పంచాయితీ భవనం ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త పంచాయతీలు చేసిన ఘనత గత ప్రభుత్వందేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కరంజి (టీ), గుబిడి రోడ్ల నిర్మాణం పనులు త్వరలో ప్రారంభమవుతుంద న్నారు. ప్రభు త్వం వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, నాయకులు కృష్ణ, రమణ, రఘు, అశోక్, శ్రావ్యవాణీ, శివరాం, మహేందర్ పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### మంత్రి లక్ష్మణ్‌కు ఆత్రం సుగుణ వినతి



**ఉట్నూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సెక్రటేరియట్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను సుగుణ మర్యాదపూర్వకంగా కలిసారు. సమస్యలపై వినతి పత్రంను అందజేశారు. సుగుణ మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గత 10 నెలలుగా బకాయిగా ఉన్న వేతనాలను తక్షణం విడుదల చేయాలని, ప్రస్తుతం అమలులో ఉన్న క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేసి, జి.ఒ 60 ప్రకారం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానంలో వేతనాలు చెల్లించాలన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉందని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమ్మె విరమించేలా చర్చలు జరిపేం దుకు తాను కూడా వారితో మాట్లాడుతానని చెప్పారు. వెంటనే ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేలకు ఫోన్ చేసి సమ్మె విరమించేలా చూడాలని తగిన ఆదేశాలు జారీ చేశారాని సుగుణ తెలిపారు.



## పోడు కోసం చెట్ల నరికివేత

### నేలకొరిగిన సుమారు 150పైగా చెట్లు
### అడ్డుకున్న అటవీ సిబ్బందిపై దాడి
### 50మంది ఆదివాసీలపై కేసు

**జన్నారం, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీలు, అటవీశాఖ పోరులో విలువైన టేకు చెట్లు నేలకొరుగుతున్నాయి. ఆదివాసీ గిరిజనులు అడవిలో తిష్టవేసి చెట్లు నరికి భూమి చదును చేసేందుకు యత్నిస్తున్నారు. అడ్డు వెళ్లిన ఇద్దరు అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కవ్వాల్ టైగర్ జోన్, జన్నారం అటవీ డివిజన్, ఇందన్పల్లి రేంజ్, కవ్వాల్ అటవీ సెక్షన్, సోనాపూర్ తండా బీట్ ని పాలఘోరీల ప్రాంతంలో 40 రోజులుగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, సిర్పూర్, లింగపూర్ మండలాలకు చెందిన సుమారు 100మంది ఆదివాసీ గిరిజనులు ఆవాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. తమ పూర్వీకులకు చెందిన భూమి ఈ ప్రాంతంలో ఉన్నట్లు చెబుతున్నారు. తమ వద్ద సదరు భూమికి సంబంధించిన కాగితాలున్నా యని, అందుకే ఈ భుమి తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ భూమి అటవీశాఖకు సంబంధించిందని, ఈ భూమిపై ఆధారాలుంటే కలెక్టర్ లేదా రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని సూచించారు. అయినా వినకుండా, 20 రోజుల క్రితం సుమారు 150టేకు చెట్లు నరికివేశారు. అప్పుడు 30మందిపై కేసు నమోదు చేశారు.

### మరో 150వరకు చెట్ల నరికివేత...

అధికారుల కౌన్సిలింగ్ అనంతరం కొన్ని రోజులు నిశబ్దంగా ఉన్న ఆదివాసీ గిరిజనులు గురువారం రాత్రి వారుంటున్న అటవీ ప్రాంతం పరిసరాల్లో సుమారు 150 చెట్లు నరికివేశారు. అడ్డు వెళ్లిన బీట్ అధికారి ప్రణయ్, బేస్ క్యాంపు వాచర్ వెంకట కృష్ణపై దాడికి పాల్పడ్డారు. వారిని అక్కడ నుంచి కర్రలతో తరిమేశారు. దీంతో భయంతో వారు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న ఇందనపల్లి రేంజ్ అధికారి శ్రీధరాచారి, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పడిపోయిన చెట్ల వివరాలు సేకరించారు. చిన్నవి, పెద్దవి కలిసి సుమారు 150కిపైగా చెట్లు నరికివేసినట్లు తెలిపారు. 50మందిపై కేసు నమోదు పాలఘోరీల ప్రాంతంలోని అడవిలో చెట్లు నరికివేయడమే కాకుండా అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడిన 50మంది ఆదివాసీ గిరిజనులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అడవిలో చెట్లు నరికివేయడమే కాకుండా ఇద్దరు సిబ్బందిపై దాడి చేశారని కవ్వాల్ డిప్యూటీ రేంజ్ అధికారి విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 50మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

# భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ పదోన్నతి చిహ్నం అలంకరణ

**ముధోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ అడిషనల్ ఎస్పీ హోదా పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... "ఒక అధికారి వృత్తి జీవితంలో పొందే పదోన్నతి అనేది కేవలం పదవి పెరుగుదల మాత్రమే కాదు, అది ఆయన చూపిన కృషి, అంకితభావం, క్రమశిక్షణకు లభించే గుర్తింపు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్ ఇప్పటివరకు ప్రజలతో మమేకమై పనిచేసిన తీరు, బాధ్యతాయుతంగా వ్యవహరించిన తీరే ఆయనకు ఈ పదోన్నతి రావడానికి ప్రధాన కారణం. ఇకపై కూడా కొత్త బాధ్యతల్లో అదే ఉత్సాహం, నిజాయితీతో ముందుకు సాగుతారని నాకు పూర్తి విశ్వాసం ఉంది." అని అభినందించారు. "ఈ పదోన్నతి నాకు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, నా ముందుండి నడిపిస్తున్న జిల్లా ఎస్పీ గారి ప్రోత్సాహం, మార్గనిర్దేశం, అలాగే నాతో పాటు పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికీ చెందుతుంది. భవిష్యత్తులో కూడా నా సేవల ద్వారా పోలీస్ డిపార్ట్‌మెంట్ ప్రతిష్టను మరింత పెంపొందించేలా కృషి చేస్తాను." అని తెలిపారు.





## వైద్యం అందించాలంటే..
# వాగు దాటాల్సిందే ?

**నార్నూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించాలంటే వాగులు, వంకలు దాటి వైద్యం అందించే పరిస్థితి నెలకొందని ఝరి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది వాపోయారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మలంగి పంచాయతీ పరిధి బారిక్ రావుగూడ గ్రామ సమీపంలోని వాగును దాటి వైద్య సేవలు అందించారు. గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సంజయ్ మాట్లాడుతూ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలుగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. బారిక్ రావు గూడ గ్రామానికి వెళ్లి వైద్యం అందించాలంటే సమీపంలోని వాగును దాటి వెళ్లాల్సిందే అన్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

# సాంప్రదాయాలను గౌరవించాలి
## డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

సంప్రదాయాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డిడి విద్యార్థినిలు, ఉపాధ్యాయురాలతో బతుకమ్మ ఆడారు. అనంతరం మాట్లాడుతూ దసరా సెలవులలో విద్యార్థులు ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంబరాలు జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో లు చిరంజీవి, శ్రీనివాస్, సాయిబాబా, విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఏసీసీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మంచిర్యాల టూ టౌన్ ఏఈ లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కార్పొరేషన్ పరిధిలోని జాఫర్ నగర్, హైటెక్ సిటీ 2 న్యూ వెంచర్, జన్మభూమి నగర్, ఇందిరా నగర్, ఇక్బాల్ అహ్మద్ నగర్, మార్కెట్ ఏరియా, హై టెక్ సిటీ, గ్రీన్ సిటీ, శ్రీనివాస గార్డెన్, అందాలమ్మ కాలనీ, మారుతి నగర్, ఒడ్డెర కాలనీ, లక్ష్మి నగర్, గౌతమ్ నగర్, ఇస్లాం పుర, ఎంసిసి ఏరియా, రాళ్ల పేట్, గొల్ల వాడ, సావిత్రి నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయలు కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పోలీసులపై కత్తితో
# దాడి చేసిన వ్యక్తి అరెస్టు



**కుభీర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

కుభీర్ మండల కేంద్రంలో గురువారం రాత్రి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నారాయణ మరో పోలీస్ అధికారిపై కత్తితో దాడి చేసిన అబ్దుల్ కలీంను అరెస్టు చేసినట్టు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కుభీర్‌కి చెందిన అబ్దుల్ కలీం భార్యతో గొడవ పడి పోలీస్ స్టేషన్ కు రాత్రి 11 గంటలకు వచ్చారన్నారు. మద్యం మత్తులో ఉన్న ఆయనను అక్కడ ఉన్న హెడ్ కానిస్టేబుల్ నారాయణ అడుక్కోగా కత్తితో దాడి పరారయ్యారన్నారు ఆయనను భైంసాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు కత్తితో దాడి చేసిన నిందితుని గురువారం పట్టుకొని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు ఎస్సై కృష్ణారెడ్డి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు
# చిత్రలేఖనం పోటీలు

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ప్రధానమంత్రి మోడీ జన్మదిన సందర్భంగా సేవా పక్వాడ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు పట్టణంలోని విజయ హై స్కూల్లో పిల్లలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆడెపు లలిత గారు మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సామ భూలక్ష్మి మరియు బిజెపి సీనియర్ నాయకులు ఆడెపు సుధాకర్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.





## కాజల్ సింగ్‌కు
# పదోన్నతి చిహ్నం అలంకరణ

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ ఏఎస్పీగా ఉన్న కాజల్ సింగ్‌కు గురువారం అదనపు ఎస్పీగా పదోన్నతి లభించిన విషయం తెలిసిందే. ఈమేరకు నెలవారీ నేర సమీక్ష అనంతరం ఎస్పీ ఆమె భుజస్కంధాలపై సింహతలాటం చిహ్నం అలంకరించి అభినందనలు తెలిపారు.

## టీబి పేషెంట్లు బలమైన
# పోషకాహారం తీసుకోవాలి
## డిప్యూటీ డీఎంహెచ్ సుధాకర్ నాయక్



**తాండూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

టీబీ పేషెంట్లు మందులతో పాటు బలమైన పోషకాహారం తీసుకుంటే తొందరగా కోలుకుంటారని డిప్యూటీ డిఎంహెచ్ఓ సుధాకర్ నాయక్ అన్నారు. ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం స్వస్థ నారీ సశ క్త పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నిర్ధారణ పరీక్షలు కూడా చేయించుకోవాలని సూచించారు. టీబీ రహిత సమాజం కొరకు టీబీ న్యూట్రిషన్ కిట్లను అందించాలన్నారు. స్వస్త్ నారీ సశక్తి పరివార్‌లో భాగంగా రఘుమోహన్ 87 మంది మహిళలకు రక్త, చర్మ సంబంధిత పరీక్షలు చేశారు.

# బంగారం కాజేసిన వ్యక్తి అరెస్ట్

**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

రూ.20లక్షల విలువైన బంగారు ఆభరణాలతో ఉడాయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సీఐ ప్రమోద్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బన్సిలాల్ హరికిషన్ జువెల్లరీ నగల దుకాణంలో మంచిర్యాలకు చెందిన వాడయిసాగర్ గత తొమ్మిది నెలలుగా జూనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంతో నమ్మకంగా పని చేశాడు. ఈ నెల 4నుంచి పనిలోకి రావడం మానేసి కనిపించకుండా పోయాడు. అతడి వద్ద ఉండాల్సిన రూ.20లక్షల విలువైన ఆభరణాలు లెక్కల్లోకి రాలేదు. ఈ నెల 18న యజమాని బానోతు ప్రేమింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శుక్రవారం సాగర్‌ను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

# నాటు సారా తయారీ, రవాణా, అమ్మిన, కఠిన చర్యలు తీసుకుంటాం




**ఖానాపూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

నాటు సారా తయారు చేసిన, అమ్మిన, రవాణా చేసిన, కఠిన చర్యలు తప్పవని ఖానాపూర్ ఎక్సైజ్ ఎస్సై వసంతరావు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి, సేవ్యా నాయక్ తండ, ఎల్లాపూర్, కొమ్ముతాండ, బీర్నంది గ్రామాలలో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఒకరిపై కేసు నమోదు చేసి ఆమె వద్ద ఐదు లీటర్ల నాటు సారాయి, 200 లీటర్ల నల్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై వసంతరావు తెలిపారు. వివిధ కేసులలో పట్టుబడిన 13 మందిని తహసీల్దార్ సుజాత రెడ్డి ముందు బైండోవర్ చేసినట్లు వారు తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది సాయన్న, రాజేందర్ ఉన్నారు.

# గుండెపోటుతో కాంట్రాక్టు కార్మికుడి మృతి

**కాసిపేట, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ కాంట్రాక్టు కార్మికుడు రేణికుంట శంకర య్య(53) శుక్రవారం గుండె పోటుతో మృతిచెందాడు. దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీ పరిధిలోని క్వార్టర్లలో పనికి వెళ్లిన శంకరయ్య ఉదయం 10.30గంటలకు ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కార్మికులు కంపెనీ డిస్పెన్సరీకి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. రూ.20లక్షల నష్టప రిహారం, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు ముందస్తుగా చేరుకుని నివారించారు. రూ.లక్ష ఖర్చుల నిమిత్తం సహాయం అందిస్తా మని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని కంపెనీ అధికారులు తెలిపినట్లు సమాచారం.




## ఓటరు జాబితా సరిపోల్చే కార్యక్రమాన్ని

# పకడ్బందీగా నిర్వహించాలి

### వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఓటరు జాబితా సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు-కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ 2002, 2025 ఓటరు జాబితాలను సరి పోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల అధికారి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు, శాసనసభ నియోజక వర్గాల వారీగా మ్యాపింగ్ చేపట్టాలని, 2002, 2025 ఓటర్ జాబితాను సరి పోల్చేందుకు ఎబీసీడీ విభాగాలుగా విభజించాలని తెలిపారు. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు ఈనెల 23వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసి, ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ఎన్నికల అధికారికి నిర్ణీత నమూనాలో నివేదిక సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజాగ్‌లోఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్లు, శ్యామలాదేవి, రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్లు కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పాల్గొన్నారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ తహసిల్దార్‌లకు తగు సూచనలు సలహాలు చేశారు, సంబంధిత ఉద్యోగులు తక్షణమే చురుగ్గా పాల్గొనాలని, తహశీల్దార్ కార్యాలయాల వద్ద 24.09.2025 వరకు కొనసాగే ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ఇంతకుముందు అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని విధులు నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 2002, 2025 ఓటరు జాబితాల సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్ల జాబితాల మధ్య విశ్లేషణ, మ్యాచింగ్, బ్యాచింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిశీలనను వ్యవస్థీకృతంగా నిర్వహించేందుకు 4 కేటగిరీలుగా విభజించి తదనగుణంగా నిర్దేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. 24వ తేదీలోగా ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా నివేదికలు రూపొందించాలని తెలిపారు.

## నాట్లు వేస్తున్న

# మహిళపై పులి దాడి

**చంద్రపూర్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా చిమూర్ తాలూకాలోని లావిరీ గ్రామానికి చెందిన ఓ మహిళపై బెబ్బులి దాడి చేసి హతమార్చింది. అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లావిరీ గ్రామానికి చెందిన కొందరు మహిళలు గురువారం పొలంలో వరి నాట్లు వేసేందుకు వెళ్లారు. ఒక మడిలో నాటు వేస్తున్న విద్య మస్త్రమ్ (42)పై పులి దాడి చేసి ఈడ్చుకెళ్లింది. ఆమె కేకలకు తోటి వారు భయపడి గ్రామంలోకి పరుగులు తీశారు. మృతురాలి భర్తతోపాటు గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకోగా ఆమె మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న ఎస్ఆర్డీ కిషోర్ దేవుడ్కర్ తన బృందంతో చేరుకుని పులి దాడిలోనే మృతి చెందిందని నిర్ధారించారు. మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆందోళన చేపట్టారు.





## శ్రీ నందిగుండం దుర్గామాత ఆలయంలో

# శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** జిల్లా కేంద్రంలోని శ్రీ నందిగుండం దుర్గామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ నిర్వహకులు లక్కాడి జగన్మోహన్ రెడ్డి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉత్సవాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈనెల 22న నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అక్టోబర్ 2న విజయదశమి వేడుకలు ఉంటాయని, ప్రతిరోజు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

# మండల బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



**ఇచ్చోడ, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఇచ్చోడ మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బాలల పరిరక్షణ కమిటీ చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ డిసిపియు సోషల్ వర్కర్ రవికాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ బాలల పరిరక్షణ కమిటీకి అంగన్వాడీ సూపర్వైజర్ కన్వీనర్ గా ఉంటూ మండల అధికారులు అయినటువంటి తాసిల్దార్ ఎంపీడీవో ఎంఈఓ ఏపీఓ ఏపీఎం మండల సమాఖ్య ప్రెసిడెంట్ ఎన్జీవో సభ్యులు కిషోర్ బాలికలు కమిటీ సభ్యులుగా ఉంటారు ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలందరూ వారి హక్కులను యధావిధిగా పొందేలా చూడాలని గ్రామంలోని బాలల పరిరక్షణ కమిటీ తప్పనిసరిగా ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో ఉన్న పిల్లలందరూ వారి హక్కులని పొందే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్ మాట్లాడుతూ గ్రామంలో బాల కార్మికులు బాల్యవివాహాలు జరగకుండా చూడాలని గ్రామం లోని ప్రతి బాల బాలికలందరూ పాఠశాలలో తప్పనిసరిగా చదువుకునే విధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పిహెచ్ఎన్ పంచాయతీ సెక్రటరీలు అదే విధంగా ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.



## పశువులను తరలిస్తున్న

# వాహనం పట్టివేత

### బస్సును ఢీ కొట్టిన వాహనం

**ఇచ్చోడ, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఇచ్చోడ మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు పశువులను తీసుకెళ్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. పది పశువులను స్వాధీనం చేసుకుని స్థానిక జైశ్రీరాం గోశాలకు తరలించారు. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనం శుక్రవారం ఉదయం నిర్మల్ బైపాస్ వద్ద వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బొలెరో వాహనంలో పశువులు ఉన్నట్లు గమనించారు. స్థానికులను చూసిన వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని బొలెరో వాహనాన్ని పోలీస్టేషన్‌కు తరలించి పశువులను గోశాలకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనలో బస్సు కండక్టర్కు స్వల్పగాయా లు కాగా ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డట్లుతెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




# బంగారం దుకాణంలో ఐటీ దాడులు

**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** జిల్లా కేంద్రంలో ఐటీ శాఖ అధికారుల దాడులు కలకలం రేపాయి. స్థానిక గాంధీ చౌక్ లోని ఓ బంగారం హోల్‌సెల్ వ్యాపారి దుకాణంలో శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్‌కు చెందిన ఐటీ శాఖ అధికారి పార్థసారథి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బంగారం హోల్‌సెల్ లావాదేవీలపై ఆరా తీశారు. కొనుగోలు, అమ్మకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐటీ రిటర్న్ ఫైళ్లను పరిశీలించారు. దాడుల నేపథ్యంలో గాంధీచౌక్ లోని కొన్ని బంగారు దుకాణాలదారులు ఉలిక్కిపడ్డారు. దుకాణాలు మూసి ఉంచారు.

# సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు జోగినిపల్లి శ్రీ రంగారావు



**ముథోల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన సోయా పంటను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అక్టోబర్ మొదటి వారంలోనే కేంద్రాలను ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు జోగినిపల్లి శ్రీ రంగారావు అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని శ్రీ పశుపతినాథ్ శివాలయం మండపంలో భారతీయ కిసాన్ సంఘ్ భైంసా డివిజన్ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అదేవిధంగా ఇటీవల కుర్చున భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందే విధంగా చూడాలన్నారు. సోయ కొనుగోలు కేంద్రాలు ఆలస్యం చేస్తే ప్రైవేట్ వ్యాపారస్తులు తక్కువ ధరకే కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా యాసంగి పంటలు వేసుకోవడానికి సైతం వెసు లుబాటు కలుగుతుందని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేస్తూ రైతులను చైతన్యవంతులు చేస్తున్నమని పేర్కొన్నారు. రైతులు భారతదేశానికి వెన్నెముక్కలని అన్నారు. రైతుతోనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని వెల్లడించారు. రైతులు పార్టీలకు అతీతంగా తమ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. రైతుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు భారతీయ కిసాన్ సంఘ్ పని చేస్తున్నదని అన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షిస్తున్న దాంట్లో తమ సంఘం ముందు వరుసలో ఉంటామన్నారు. రైతులను రాజు చేయడమే తమ సంఘం ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు పసల్ బీమా చేయడం వల్ల మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు భారీ సంఖ్యలో సమ్మేళనానికి తగిలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సంఘటన మంత్రి దోనూరు రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబిర్ ఆనంద్, బైంసా డివిజన్ బాధ్యులతో పాటు మండల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర క్రిస్టియన్ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్
- క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్







**నిర్మల్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన క్రైస్తవ మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్రైస్తవ మైనారిటీల సమస్యలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సమక్షంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని క్రైస్తవులు అభివృద్ధి సాధించాలని అన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో చర్చి నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, క్రైస్తవుల కుల, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరు, సమాధుల కోసం స్థలాల కేటాయింపు తదితర అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రైస్తవ మైనారిటీల సమస్యల పరిష్కారానికి తగిన సిఫారసులు ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన క్రైస్తవులకు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖాధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. చర్చి, కమ్యూనిటీ హాల్ నిర్మాణ అనుమతుల విషయంలో అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకు ముందు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు తమ సమస్యలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్, చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, అసోసియేట్ పాస్టర్లు, జిల్లా స్థాయి క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు

# శాంతియూత పోరాటాలు చేద్దాం

- మాజీ ఎంపీ సోయం బాపురావు
- ఉద్యమ కార్యాచరణ పై ఆదివాసీ పెద్దలతో చర్చలు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు  శాంతియూత పోరాటాలు చేద్దామని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావు పేర్కొన్నారు. శుక్రవారం  ఆదిలాబాద్ లోని ఆయన నివాసంలో  ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజ్ గోండ్ సేవ సమితి, గొండ్వాన పంచాయతీ రాయి సెంటర్ సార్ మేడిలు, దేవరి,గ్రామ పటేల్లు, మహాజన్లతో సమావేశమయ్యారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే అంశం పై చేపట్టాల్సి కార్యాచరణ పై చర్చించారు. ర్యాలీలు, సభలను శాంతియూతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సోయం బాపూరావు  మాట్లాడుతూ కేసు కోర్టులో ఉందని  ప్రతి ఒక్కరు చట్టాలను గౌరవించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా ర్యాలీ లు, సభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క ఆదివాసీ తమ విధిగా ప్రతి నిరసన కార్యక్రమం లో పాల్గొనాలని ఇది రాబోయే ఆదివాసీ తరానికి బాటలు వేసిన వాళ్ళము అవుతామన్నారు. సమావేశంలో గొండ్వాన గోండ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు సిడం అర్జు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సేద్మకి ఆనంద్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విషం రావు, జిల్లా అధ్యక్షులు పంద్రం శంకర్, జిల్లా మేడి కుర్సంగ్ మోతిరం, సోనే రావు, తనజీ, జిల్లాల సర్ మెడీలు,గ్రామ పటేల్లు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# అదనపు కలెక్టర్ రాజేశ్వర్ బాధ్యతల స్వీకరణ

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఎస్.రాజేశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకు చేరుకున్న ఆయన నేరుగా కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అక్కడి నుంచి డీఆర్డీఏ కార్యాలయంలో అధికారిక నివాసానికి చేరుకున్నారు. డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీపీవో రమేశ్ స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కమిషనర్ సీవీఎన్. రాజు, అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. బల్దియా ప్రత్యేకాధికారిగా కూడా ఆయన బాధ్యతలు చేపట్టారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. బల్దియాకు సమకూరుతున్న ఆస్తి పన్ను, శానిటేషన్ పరిస్థితిపై ఆరా తీశారు. మున్సిపల్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

**ప్రభుత్వ పథకాల పకడ్బందీ అమలుకు కృషి..**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశం మేరకు ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను పకడ్బందీగా అమలు చేసేలా కృషి చేస్తానన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వేగవంతం చేసేలా చూస్తానన్నారు. కార్యాలయంలోని శానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలతో పాటు కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ చాంబర్లను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.









## దక్షిణ భారతదేశంలో అత్యుత్తమ సిఎండీగా

# అవార్డు అందుకున్న ఎన్.బలరాం నాయక్

**మందమర్రి, సెప్టెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



భారతదేశంలో అత్యుత్తమ సంస్థల నాయకుల కేటగిరీలో అత్యుత్తమ సీఎండీగా గుర్తిస్తూ ప్రతిష్టాత్మక ఏసియా పసిఫిక్ హెచ్ఆర్ఎం అవార్డ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో శుక్రవారం రోజు అవార్డ్ స్వీకరించారు. ఈ మేరకు మందమర్రి సింగరేణి కార్యాలయం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఈస్టర్న్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ఇన్ మేనేజ్మెంట్ (కోల్కతా) చైర్మన్, డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.పి.బెనర్జీ, అడ్వాంటేజ్ గ్రూప్ వ్యవస్థాపకురాలు స్మితి భట్ దియోరా తదితరులు పాల్గొన్నారు. సంస్థ ఆర్థిక వ్యవహారాలలో ఫైనాన్షియల్ ఇంజినీరింగ్ ప్రక్రియ చేపట్టి సంస్థకు బలమైన ఆర్థిక పునాది వేశారు. ముఖ్యంగా సింగరేణి చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రమైన ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకును ప్రారంభించడంలో కీలకపాత్ర పోషించారు. వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించడం కోసం రెండు ఏజెన్సీలను ఏర్పాటు చేసుకొని అధ్యయనం జరుపుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కూడా దక్కించుకోవడం విశేషం. రాజస్థాన్ లో సోలార్, థర్మల్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకోవడంలో ప్రత్యేక చొరవ చూపారు. అదే సమయంలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా కార్మికులందరికీ కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సంస్థ వ్యాపార విస్తరణలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వయంగా 20 వేలకు పైగా మొక్కలు నాటడాన్ని కొనియాడారు. గత ఏడాది కాలంగా చేపట్టిన విస్తృత అభివృద్ధి, సంక్షేమ, సీఎస్ఆర్ కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు బహూకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తనకు ప్రతిష్టాత్మక అవార్డు రావడంపై సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ హర్షం వ్యక్తం చేస్తూ ఇది సింగరేణి కార్మికులు, అధికారుల సమష్టి కృషికి దక్కిన గుర్తింపు అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని విశ్వవ్యాప్తం చేయడానికి ప్రతీ ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని కోరారు.